

# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి :14 సంచిక: 02 హైదరాబాద్ 2014 జూన్ పేజీలు 40

Please visit : www.srimeherbaba.com వార్షిక సభ్యత్వం : రూ.100/-

# బాబా ఆఖరి ప్రసంగం (1925 జులై 10)

**(మౌనం పాటించడానికి పూర్వం - మౌఖికంగా)**

జులై ఒకటో తేదీ తర్వాత బాబాను బయటవారు ఎవరూ దర్శించకూడదని ఉత్తరాల ద్వారా తెలియజేసినప్పటికీ, జులై 2వ తేదీన మెహెరాబాద్‌కు కొంతమంది పార్శీ రాజకీయ నాయకులు బాబా దర్శనం కోసం వచ్చారు. వారితో భారత రాజకీయాలు, ఆధ్యాత్మిక విషయాలు గురించి చర్చించిన మీదట, **'మనస్సు - దేహం'** గురించి బాబా వివరించారు. బాబా ఇచ్చిన మౌఖికంగా చేసిన ఉపన్యాసాలలో ఇదే చివరిదీ - ఆఖరిదీను.

## 'మనస్సు - దేహం'

"మనంగా విసర్జించిన మలం ఎందుకు పనికిరాదు. పంది మాత్రమే దీన్ని తింటుంది. అదేవిధంగా, చనిపోయిన మృతదేహం నుంచి మానవ శరీరంలోని మాంసం ముద్దను తీసివేస్తే, కేవలం ఎముకలు మిగులుతాయి. వీటిని కుక్కలకు విసిరేస్తారు. మనిషి యొక్క మనస్సు, మాంసం ముద్దలాంది. మనిషి యొక్క దేహం, ఎముకలతో సమానం. ఒక వ్యక్తి మాంసాన్ని తిని, జీర్ణం చేసుకోగల్గుతాడు. అంటే దాని అర్థం అతను మాంసాన్ని ఉపయోగిస్తున్నట్లు. కానీ, ఎముకలు తినలేడు. వాటివల్ల ఉపయోగం లేదు. అందువల్ల ఎముకలను కుక్కలకు వేస్తున్నారు. మనుష్యులు తమ మనస్సు గురించి శ్రద్ధ వహించాలి. ఎందువల్లనంటే అది మాంసం ముద్దలాంటిది కాబట్టి. మనస్సు నిర్ణీత మార్గాల గుండా ప్రయాణించేలా దానికి తగిన శిక్షణ ఇవ్వాలి. ఈ భౌతిక దేహాన్ని భద్రపరచలేం. ఏదో ఒక రోజున వదిలి వెయ్యాలి. మరింత వివరంగా చెప్పాలంటే - చేతి వేలు తెగినా, కాలు విరిగినా బాధపడాల్సిన పన్లేదు. ఏదో ఒక రోజున ఈ భౌతిక దేహం మొత్తాన్ని వదిలేయాల్సిందే! అందువల్ల, మానవుడు తన మనస్సు గురించి అత్యంత శ్రద్ధ తీసుకోవాలి. అది ఎంతో అతనికి ఉపయోగపడుతుంది. మనస్సును అదుపులో ఉంచుకొని సన్మార్గంలో ప్రయాణించేలా చేయాలి. మనస్సుని ఎప్పుడూ తనిఖీ చేసుకోవాలి. సక్రమంగా వినియోగించు కోవాలి. మానవుడు ఏదో ఒక రోజున పరిత్యజించాల్సిన ఈ దేహాన్ని ముగ్గురి కోసం వినియోగించుకోగల్గాలి. 1. భగవంతుడు 2. గురువు, 3. తోటివారు.

ఈ దేహం అలసి సొలసిపోయి నశించి పోతుంది. ఈ దేహం ఎన్నో బాధలు తెచ్చిపెడుతుంది. శరీరంతో ఉన్న ప్రాణిగా మనిషి బాధలు అనుభవించి తీరాలి. మానవ దేహంలో ప్రాణం ఉన్నంతవరకూ, శరీర అవయవాలన్నీ ఆధీనంలో ఉన్నంత వరకూ, మనిషి తన శక్తియుక్తులతో మంచి పనుల కోసం మనస్సు-దేహాన్ని వినియోగించాలి, అని బాబా తన సందేశంలో పేర్కొన్నారు.

# బాబా సందేశం

భగవంతుడు ప్రధానం.

పలువురి ప్రశంశలు, మెప్పుకోలు కాదు.

DO YOU WANT BABA OR APPRECIATION.

**- MEHER BABA**


**గౌరవ సంపాదకులు**
**మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**krishnanandm@yahoo.com**
**malladisukku@gmail.com**

***వ్యవస్థాపకులు:***
**దశిక ప్రసాదరావు**
**040-65699611**


## లోపలి పేజీలలో...


1. సంపాదకీయం 5
2. అరుదైన శీర్షిక 6
3. గుజరాతీ సహవాస్ 7-13
4. పావగడ రజతోత్సవాలు 14-16
5. ముగిసిన యువజన సమ్మేళనం 17
6. మా మాటలు 18-19
7. లార్డ్ మెహెర్ 20-27
8. ఎన్.వి.యస్. సత్యన్నారాయణ 29-35
9. తత్త్వము మాదిరి 36
10. బాబా మౌనంగా మాట్లాడుతున్నారు 37
11. ప్రార్థనలు



**ఉత్తర ప్రత్యుత్తరాలకు**

ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218


### మనవి

**మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**

Please visit : www.srimeherbaba.com

# బెంగళూరులో సహవాస్

## 2014 జూన్ 14, మ. 3 గంటల నుండి..,

అవతార్ మెహెర్‌బాబా సెంటర్ బెంగళూరు ఆధ్వర్యంలో రెండ్రోజుల ప్రత్యేక సహవాస్ 2014 జూన్ 14,15 తేదీలలో ఏర్పాటు చేసినట్లు శ్రీ ఎ. రాజగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని పూర్ణిమ కన్వెన్షన్ సెంటర్, చర్చి ప్రక్కన, విజయ జూనియర్ కాలేజి దగ్గర, జయానగర్, 4వ బ్లాక్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక సెంటర్ ప్రాంగణంలో మెహెర్‌బాబా వారి పాలరాతి విగ్రహ ప్రతిష్ఠ ప్రారంభోత్సవం నిర్వహిస్తున్నారు. అవతారుని నిలువెత్తు పాలరాతి విగ్రహాన్ని రాజస్థాన్‌లోని జైపూర్‌లో రూపొందించినట్లు ఆయన తెలిపారు. సహవాస్ జూన్ 14 మ. 3 గంటల నుండి ఆ మర్నాడు 3 గంటల వరకు నిర్వహిస్తున్నారు. మరిన్ని వివరాలకు శ్రీ ఎ. రాజగోపాల్ 09845697738 లేదా శ్రీమతి నర్మద 09980522414, C/o 1186/14, 35th C Cross, 26th Main, 4th Block, Jaya Nagar, Bangalore సంప్రదించగలరు.

# జలనిధి



గత కొంత కాలంగా, అంటే 2013 అక్టోబరు మాసంలో శ్రీ వై.యస్. రావు బాబాలో ఐక్యమయినప్పటి నుండీ రెస్టు హౌస్‌కు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రతిరోజు స్థానికంగా ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి సరఫరా చేస్తున్నట్లు, తద్వారా అధిక ఆర్థిక భారాన్ని భరించవల్సివచ్చిందని అన్నారు. ఈ ఆర్థిక లోటును పూరించవల్సిన ఆవశ్యకత ఎంతో వుందని చెబుతూ శ్రీ వై.యస్. రావు గారు ఏర్పాటు చేసిన **'జలనిధి'కి** తగిన విరాళాలు అందజేసి సహకరించవల్సిందిగా యాజమాన్యం కోరుతున్నారు. రెస్టు హౌసులో మీరు చెల్లించే లేదా అందజేసే విరాళాలకు స్థానిక మేనేజర్, ఆంధ్రా రెస్టు హౌస్ నుండి 'రశీదు' తప్పక పొందవల్సిందని అన్నారు.

సంపాదకీయం

# జూలై 10

మరి కొద్ది రోజుల్లోనే జూలై పదవ తేదీ వస్తోంది!!
రోహిణీ కార్తి ఎండల తీవ్రత తర్వాత వచ్చే తొలకరి జల్లు లాంటిది
మెహెర్ ప్రేమికులకు జూలై 10వ తేదీ.
మెహెర్‌బాబా 1925 జూలై 10వ తేదీ నుంచి ఆయన భౌతికదేహం
త్యజించేదాకా 1969 జనవరి 31 వరకు, అంటే 44 సంవత్సరాలు
కఠిన మౌనంలోనే అనేక సందేశాలు తన ప్రేమికులకు అందించారు.
క్షణకాలం నోరుమూసుకుని కూర్చోవడం మనకు చాలా కష్టం.
ఆ క్షణంలోనే ఎక్కడలేని ఆలోచనలు ఉప్పెనలాగా వచ్చిపడతాయి.
తెగని ఆలోచనా దొంతరలు ఉబ్బి తబ్బిబ్బు చేసేస్తాయి.
పెదిమలు పెగుల్చుకుని గట్టిగా అందరికీ వినపడేలా ఆ క్షణంలో
మాట్లాడకపోతే గుండెకు ఆక్సిజన్ అందనంత ఆందోళన చెందుతాం.
సగటు మానవుని విషయంలో ఇది సహజం.
అవతారుడు మౌనం ప్రారంభించిన రోజైన జూలై 10 నాడు,
మెహెర్‌బాబా తన ప్రేమికులందర్నీ మౌనంగా ఉండమని కోరారు.
మెహెర్‌బాబా ఆదేశాల మేరకు, జూలై 9 అర్థరాత్రి నుండి జూలై 10
రాత్రి 12 గంటల దాకా బాబా ప్రేమికులందరూ 'మౌనంగా'
బాబా నామం తలచుకుంటూ – మెహెరుని ధ్యాసలో గడపాలనుకోవడం ముదావహం.
కాగా, ఇటీవల చాలామంది బాబా ప్రేమికులు మౌనవార్షికోత్సవానికి
మెహెరాబాద్ – బాబా సమాధి దగ్గరకు వెళ్తున్నారు.
మెహెరాబాద్‌కు విచ్చేసేవారందరి కోసం బాబా ట్రస్టు వారు, ఆంధ్రా రెస్టు హౌసు
తగిన భోజన వసతి ఏర్పాట్లు పెద్ద ఎత్తున చేస్తున్నారు.
అలాగే మెహెర్‌స్థాన్ కొవ్వూరులో,
అన్ని బాబా సెంటర్లలో మౌనవార్షికోత్సవం కోసం
ఆయా పెద్దలందరూ తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.
**జూలై 10వ తేదీన**
మెహెరుని ధ్యాసలోనే గడిపే ప్రయత్నం చేద్దాం!
మధురానుభూతిని పొందుదాం!!
జై మెహెర్‌బాబా.

# అరుదైన శీర్షిక

సద్గుర్వీణి బాబాజాన్ మేర్వాన్ భృకిటిని ముద్దాడిన పిదప **1921 నుండి 1931** దాకా మెహెర్‌బాబా మెహెరాబాద్‌లో పలు సేవాకార్యక్రమాలు చేపట్టారు. 1925 జూలై 10 నుండి మౌనం ప్రారంభించారు. ఆశ్రమ పాఠశాలలను నిర్వహించారు. **1931-1937** మధ్యకాలంలో అమెరికా, లండన్ తదితర విదేశీ పర్యటనలు చేశారు. **1937-1949** మధ్యకాలంలో మెహెర్‌బాబా మసు సేవా కార్యక్రమాలు చేపట్టారు. **1949-1952** మెహెర్‌బాబా నవజీవనం, మనోనాశ్ కార్యక్రమాలను నిర్వహించారు. **1952-1959** మధ్యకాలం మాత్రమే బాబా **ఫ్రీ లైఫ్** గడిపారు. ఈ సమయంలో హమీర్‌పూర్, ఆంధ్రా పర్యటనలు చేశారు. ప్రజాదర్శన కార్యక్రమాలు ఇచ్చారు. హమీర్‌పూర్ యాత్రలో ఈ యుగావతారునిగా, అవతార్ మెహెర్‌బాబాగా ప్రకటించారు. **1955 నవంబరులో** మెహెరాబాద్‌లో గుజరాతీ, తెలుగు, హిందీ, మరాఠీ సహవాస్‌లు నిర్వహించారు. ఈ సహవాస్‌లు ఒక్కొక్క ప్రాంతానికి వారం రోజులు చొప్పున కేటాయించారు. ఈ ఏడు రోజులూ, నాలుగు ప్రాంతాలవారితో బాబా అనేక ఆధ్యాత్మిక విషయాలు బాబా చర్చించారు. ఒక సాధారణ స్నేహితుని మాదిరిగా విచ్చేసిన నాలుగు ప్రాంతీయ ప్రేమికులతో ఎలాంటి అరమరికలు లేకుండా అనేక విషయాలు వారితో చర్చించారు. ఈ విషయాలన్నీ లార్డ్ మెహెర్‌లో చాలా వివరంగా వర్ణించారు. ప్రతి బాబా ప్రేమికుడు ఆనాటి సహవాస్ విషయాలు తప్పక తెలుసుకోవాలి. 1955 నవంబరులో సహవాస్‌లో తెలుగువారు శ్రీ ఎ.ఎస్. జగన్నాథ్, శ్రీ ఎస్వీఎస్ సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు. అవతారుని అతిధులుగా మేం ఆనాడు మెహెరాబాద్‌లో బాబా సహవాస్‌లో పాల్గొనే భాగ్యం మాకు లభించిందని శ్రీ ఎస్వీయస్ చెప్తారు. ఏతావాతా ఏమంటే, గత రెండు సంచికలలో 1955 నవంబరు 1 నుండి ప్రారంభమైన గుజరాతీ సహవాస్‌లోని విశేషాలను మెహెర్‌బాబా పత్రికలో ఈ తరం పాఠకుల కోసం ప్రత్యేకంగా ధారావాహిక సీరియల్‌గా అందజేస్తున్నాం. వచ్చే నెల జూలై 2014 సంచికతో ఈ సహవాస్ విశేషాలు ముగుస్తాయి.అనంతరం, తెలుగువారి సహవాస్ కార్యక్రమ విశేషాలు మొదలవుతాయి. అనంతరం హిందీ, మరాఠీ ప్రేమిక సహవాస్ వివరాలు యధాతథంగా, సంక్షిప్తంగా, సమగ్రంగా అందజేసే ప్రయత్నం చేస్తున్నాం. పాఠకులు ఈ అరుదైన శీర్షికను తప్పక చదవండి. చదివించండి. ఆ పిదప పాఠకుల అమూల్య అభిప్రాయాలు తెలియజేయాల్సింది. అవకాశం వున్న వారందరూ ఇంగ్లీషులో వున్న లార్డ్ మెహెర్‌లో ఈ శీర్షికను మరింత స్పష్టత,అవగాహన కోసం పఠించాలనుకోవడం ముదావహం!!

# గుజరాతీ సహవాస్

ముంబాయి బాబా సెంటరు సోరాబ్‌జీ సింగన్‌పోరియా, బర్జోర్ మెహెతాలను
బాబా కార్యక్రమాలు బాగా నిర్వహిస్తున్నారని బాబా ప్రశంసించారు.
ముంబాయిలో సోరాబ్‌జీ బాబా సెంటరు ప్రారంబించారు.
అయితే సెంటర్ ప్రారంభించిన నాటి నుంచీ ఏవో ఒక కష్టాలు ఎదుర్కొంటున్నామని
సోరాబ్‌జీ బాబాతో అన్నాడు.
ఏ కార్యక్రమం చేపట్టినా కొంతమంది వ్యతిరేకించేవారుంటారు.
వారు ఇబ్బందులు పెడతారు. అవేవీ పట్టించుకోకుండా మీ మానాన మీ
కార్యక్రమాల్ని నిర్విఘ్నంగా కొనసాగించమన్నారు బాబా.
నేను భగవంతుడినన్న విషయం మీరు గుర్తుంచుకోండి.
ఒక ఫుట్‌బాల్‌లాగా వుండండి.
ఫుట్‌బాల్‌ని ఆడేటప్పుడు ఎవరు ఎటు ఆ బంతిని కాలితో తన్నితే అది అటు పోతుంది.
ఎవరు ఎలా తన్నినా బంతి గోల్‌లో పడాలి.
ఇరు పక్షాల లక్ష్యం అదే. అదే మాదిరిగా ఎన్ని కష్టాలు ఎదురైనా,
ఎంత వ్యతిరేకత వున్నా మౌనంగా భరించడం అలవరుచుకోండని బాబా అన్నారు.
ఏదో ఒకరోజున మీ లక్ష్యాన్ని మీరు చేరగలుగుతారని బాబా హితవు చెప్పారు.
సహవాసీలతో బాబా మాట్లాడుతూ
భగవద్వచనంలో నేను బంధనాల (బైండింగ్స్) గురించి చెప్పలేదన్నారు.
మీకు మీరే గొప్ప బంధనం అన్నారు బాబా.
అదెలాగో వివరిస్తూ "నేను" అనేదే గొప్ప బంధనం అన్నారు బాబా.
కొందరికి సుఖసంతోషాలు అనుభవిస్తూ వారికి భగవంతుడు కావాలనుకుంటారు.
**"నాకు మంచి భోజనం కావాలి"** నుండి **"నాకు భగవంతుడు కావాలి"** వరకూ
ఇదే వరస. అన్నింటా ఈ **"నేను"** ప్రధాన పాత్ర పోషిస్తుంది.
ఈ **"నేను"** ఎక్కడ నుండి వచ్చింది?
ఈ విషయాన్ని ఏ ఆధ్యాత్మిక గ్రంథంలోనూ సవివరంగా వివరించ లేదు.
కాబట్టి నేను చెప్తాను.
శ్రద్ధగా ఆలకించండన్నారు బాబా.
బాగా ఆకలిగా వున్నప్పుడు మీరేమంటారు.
నాకు ఆకలిగా వుంది.
తినడాని నాకేదైనా కావాలని అడుగుతారు.
కడుపు నిండాక మరిక ఆకలి గురించి,

అలాగే తిండి గురించి మీరేమీ పట్టించుకోరు.
కానీ కొన్ని గంటలు గడిచాక మళ్ళీ ఆకలి వేసినప్పుడు
"నాకు తినడానికి ఏమైనా వుందా?" అని అడుగుతారు.
ఇదంతా మీకు తెలుసు కదా అంటూ బాబా ఇలా వివరించారు.
మొట్ట మొదట భగవంతుడి పరబ్రహ్మ స్థితి మాత్రమే ఉండేది.
భగవంతునికి తన గురించిన చైతన్యం లేదు.
అయితే నిశ్చలంగా ఉన్న సముద్రంలో ఒక చిన్నపాటి అల ఎలా పుడుతుందో,
అదే విధంగా తన గురించి తనకి చైతన్యంలేని స్థితిలో వున్న భగవంతునిలో
"నేనెవరిని"? అన్న ఒక ప్రశ్న కలిగింది.
తనని తాను తెలుసుకోవాలనే ఒక ఇచ్ఛ, కోరిక కలిగింది.
దాంతో బంధనాలు మొదలైనాయి.
సముద్రంలో లెక్కలేనన్ని నీటి బిందువులనావరించాయి.
సృష్టి మొదలయింది. ప్రతి నీటి బిందవూ తానెవరో తెలుసుకోవాలనుకుంది.
చివరిగా యుగయుగాలు గడిచాక కూడా మొదటి కోరికే
"నేనెవరిని" తెలుసుకోవాలని కోరిక.
తానే భగవంతుడనని తెలుసుకున్నాక,
ఎవరైతే సాధారణ చైతన్య స్థితికి దిగి వస్తారో వాళ్ళు
ఇతరుల నుంచి కొంత వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుంది.
అదే సాక్షాత్తు అవతారుడే, ఆ భగవంతుడే దిగివస్తే
ఆయనకి విపరీతమైన వ్యతిరేకత ఎదురౌతుంది.
ఇది దాదాపు అన్ని అవతార యుగాల్లోనూ జరిగింది.
జొరాష్టరు, రాముడు, కృష్ణుడు, బుద్ధుడు, జీసస్, మహమ్మదు,
అందరూ వ్యతిరేకత నెదుర్కొన్నవారే. అదే మరలా ఇప్పుడూ జరుగుతోంది.
నవంబర్ 6, ఆదివారం ఉదయం 7 గంటలకు బాబా మెహెరాబాద్ వచ్చారు.
మండలితో కొద్దిసేపు మాట్లాడి, సహవాసీల మధ్యకు వచ్చారు.
**అవతారుడు ఎంతో అందంగా ఉన్నాడు.**
**ఆయన శరీరంలోని ప్రతి భాగం కాంతులీనుతోంది.**
**ప్రేమ మధువు ఒలకపోస్తున్నాడు. అవతారుని కళ్ళు మిరిమిట్లు**
**గొలుపుతున్నాయి. ప్రేమికుల హృదయాలను నేరుగా తాకుతున్నాయి.**
**ఆ సుతిమెత్తని కాంతి రేఖలు,**
**ప్రేమికుల హృదయాలలో ఎన్నటికీ మానని గాయాలు చేస్తున్నాయి.**

**"నేనెలా ఉన్నానని"** బాబా అడిగారు.
అందరూ వారికి తోచిన సమాధానం ఇచ్చారు.
ఎంతో అందంగా ఉన్నావని వర్ణించారు.
అయితే తనకు గత రాత్రంతా కంటిపై కునుకు లేదన్నారు బాబా.
అయినప్పటికీ ఎంతో అందంగా ఉన్నానని మీరంటున్నారని బాబా అన్నారు.
మీలో గత రాత్రి ఎవరికి నిద్ర పట్టలేదని అడిగారు.
అదీ దుబాష్, మీనూ కరాస్ తమకు నిద్ర పట్టలేదని చెప్పారు.
నేనిది నమ్మనన్నారు బాబా చమత్కారంగా.
ఎందుకంటే నిన్న రాత్రి మీరు పెద్దఎత్తున గుర్రు పెడుతుంటే
నేను చూశానని ఛలోక్తిగా అన్నారు.
బాబా ప్రేమికుడు కోహియార్ కేసి కన్ను గీటుతూ
వీళ్ళిద్దరూ నిద్ర పోయారో లేదో చెప్పమని కోహియార్‌ని అడిగారు.
రాత్రి వారిద్దరి ప్రక్కనే తానున్నానని,
వారిద్దరి గురకతో తాను క్షణం కూడా నిద్ర పోలేదని కోహియార్ చెప్పడంతో
అందరూ భళ్ళున నవ్వుకున్నారు.
జ్ఞానం రెండు విధాలు.
పరోక్ష జ్ఞానం, ప్రత్యక్ష జ్ఞానం.
ఇల్‌ముల్ యకీన్.   హక్‌ఉల్ యకీన్.
మనం మధ్యలో ఉన్న వివిధ దశల్ని ప్రస్తుతానికి వదిలేద్దాం.
వీటినే మేదస్సుకి సంబంధించిన, మానసిక జ్ఞానము,
ఆధ్యాత్మిక జ్ఞానము అంటారు.
ఇది ఎంత విడమర్చి చెప్పాలన్నా అసాధ్యం.
జ్ఞానం అనుభూతి చెందాల్సిదే.
అయినా, నేను సాధ్యమైనంత వరకూ మీకు అర్థమయ్యేలాగా చెప్తాను.
మేధస్సు ద్వారా కలిగిన జ్ఞానం – అది అనుభవించటం లేదా
అనుభూతి చెందటం వల్ల కలిగినది కాదు.
అనుభూతి చెందిన జ్ఞానానికి, మేధస్సుతో తెలుసుకున్న జ్ఞానానికి
నక్కకీ, నాగలోకానికీ వున్నంత తేడా వుంది.
అయితే మానసిక జ్ఞానము కూడా అతి కొద్దిమంది సాధిస్తారు.
నేను అందిరిలో వున్నాను.
నేనే అందరిలో, అన్నింటిలో వున్నానని, సర్వము నేనేనని, నేను ఒక్కడినేనని,
అతి కొద్దిమంది మాత్రమే మనస్సుతో (గ్రహించి) తెలుసుకుంటారు.

హిందువుల వేదాంతంలో 'జ్ఞానం' గురించి అనేక గ్రంధాలలో ఎంతో వివరంగా వుంది. **'గాడ్ స్పీక్స్'లో** నేను సవివరంగా చెప్పాను.
అది చదివాక, 'నేను' తప్పితే ఇంకేమీ లేదని మీకర్ధమవుతుంది.
అయితే అది 'జ్ఞానం' కాదు. అవగాహన మాత్రమే.
మొదలు నుంచి తుది వరకూ, భగవంతుడు తప్ప మరేమీ లేదు.
అది చదివాక నీవే భగవంతుడవని అర్ధం చేసుకుంటావు.
కానీ అది మానసిక అవగాహన మాత్రమే.
అది కనీసం మానసిక జ్ఞానం కూడా కాదు.
అయితే మానసిక జ్ఞానం, మానసిక అవగాహన అంటే ఏమిటి?
మనమందరం ఒకటే అనే అవగాహన కలుగుతుంది.
గాడ్ స్పీక్స్ చదివాక అప్పుడు బాబా చెప్పింది నిజమని అంటారు మీరు.
అయితే కొద్ది నిమిషాలలో, ఏదైనా బాధ కలిగినా, అవమానం జరిగినా, ఈ అవగాహన చెదిరిపోతుంది. మరి మానసిక జ్ఞానమంటే ఏమిటి?
ఒక పెద్ద మనిషి అనేక పుస్తకాలు, అఖరికి గాడ్ స్పీక్స్ కూడా చదివాడనుకుందాం. అతనికి "నేనే" అందరిలో వున్నానన్న విషయం అర్ధమవుతుంది. బాబానే భగవంతుడని నమ్మాడతను.
అతనికి ఎన్ని బాధలు కలిగినా, అవమానాలు కలిగినా, అతనేమంటాడంటే 'ఇదంతా బాబా ఇచ్ఛ' అని భావిస్తాడు.
అతనిలో ఎంత మాత్రము పగ, ప్రతీకార వాంఛ కలగదు.
ఇదే మానసిక జ్ఞానమంటే.
అతి కొద్దిమందికే ఈ స్థితి సిద్ధిస్తుంది.
ఈ స్థితి సాధించాక మరో రెండు దశలుంటాయి.
తరువాత చివరి దశ 'జ్ఞానం సిద్ధించటం'.
అహంబ్రహ్మాస్మి స్థితి. ఇది చాలా చాలా కొద్ది మందికే సిద్ధిస్తుంది.
ఇంగ్లాండులో విపరీతమైన మంచు కురుస్తున్నపుడు చలిలో కెమెరా ముందు నిలవాల్సొచ్చిన సంఘటన గురించి చెప్తూ,
జ్ఞానం గురించి చెప్పాల్సి వచ్చింది.
మనము కాని దాన్ని అవుననన్నట్టు నటించరాదు.
భగవంతునికి సర్వం తెలుసు.
సర్వం అంటే సర్వం తెలుసు.
సర్వంలో భగవంతుడికి తెలిసిన సర్వం కూడా వుంది.
ఇదంతా గాడ్ స్పీక్స్‌లో వివరించాను.

ఐతే, ఒక విషయం గ్రహించండి.
అదేమంటే కపటం వద్దు.
అలాంటి పరిస్థితి నెదుర్కొవటానికి ఒక మార్గం వుంది.
ఒక్క విషయాన్ని గుర్తుంచుకోండి. భగవంతుడు మాత్రమే వున్నాడు.
భగవంతునికి సర్వం తెలుసు. ఆయనే సర్వము, అంతటా ఆయనే వున్నాడు,
ఆయనకి సర్వము తెలుసు. ఇది జ్ఞాపకం వుంచుకుంటే
నీలో కపటం వుండదు.
ఆ రోజు ఆదివారం అవ్వడంతో అహ్మద్‌నగర్ నుంచి
కాకా చిన్‌చోర్‌కర్, ఆదీ సీనియర్‌తో కలిసి వచ్చాడు.
చిన్‌చోర్‌కర్‌ని చూస్తూనే మూడ్రోజుల నుంచి నీకు తీరిక లేకపోయింది.
ఈ మూడ్రోజుల్లో నేనెన్నో ఆధ్యాత్మిక విషయాలు చెప్పాను.
ఈ రోజు డబ్బుల విషయం మాట్లాడుతుంటే నీవు ప్రత్యక్షమయ్యావ్.
ఏమైనా చెప్పేది శ్రద్ధగా వినమని చిన్‌చోర్‌కర్‌తో నవ్వుతూ అన్నారు బాబా
నేను డబ్బులకి ఎన్నడూ ప్రాధాన్యం ఇవ్వలేదు.
ఎలా డబ్బు వచ్చిందో,
అలాగే నేను ఖర్చు చేశానని బాబా అన్నారు.
ఎవరో ఒకరిద్దరు పార్శీ ప్రేమికులు తప్పించి
అందరూ కూడా నాలాగే పెద్దగా ధనవంతులు కాదు.
నారీమన్, మెహెర్ జీలు నాకవసరమైనప్పుడు తగిన డబ్బు సమకూర్చారు.
అప్పుడప్పుడూ సరోష్ ఇరానీ కూడా నాకు ధన సహాయం అందించాడు.
ఇక సీనియర్ ఆదీ తన యావదాస్థిని నాకర్పించాడన్న సంగతి మీకు తెలుసు.
రాబోయే రోజుల్లో వచ్చే మూడు గ్రూపులకి కూడా నేను ఇదే విషయాల్ని చెప్పదల్చాను.
1956 ఫిబ్రవరి 15 నుండి ఒక ఏడాది కాలం నా ప్రేమికులకు,
అలాగే మండలివారందరికి నేను దూరంగా కఠిన ఏకాంతవాసం ఉండదల్చాను.
ఈ విషయం మీకందరికీ ఇప్పటికే తెలుసు.
ఈ సమయంలో నాపై ఆధారపడిన మండలివారందరికీ
తగిన ఏర్పాట్లు చేయవల్సిన బాధ్యత వుంది.
ఫిబ్రవరి 15 అంటే మరో రెండు నెలల గడువు మాత్రమే మిగిలివుంది.
ఈ రెండు నెలలలో మీలో ఎవరైనా తగిన సహాయం అందించగల్గితే
నేను దానిని స్వీకరిస్తానన్నారు బాబా.
అయితే ఎంత మొత్తం పంపాలి అన్నది మీ స్థోమతకి వదిలి పెడుతున్నానన్నారు.
మీకు భారం కాకుండా వుంటే కాకాబారియా కేరాఫ్: ఆదీ కే ఇరానీ పేరున

1956 జనవరి లోగా పంపమని బాబా అన్నారు.
ఇప్పుడు పేదల సేవా కార్యక్రమం మొదలౌతుంది.
మీరందరూ నాతో ఉండి ఆ కార్యక్రమం జరుగుతున్నంత సేపూ భగవంతుని నామం స్మరించమన్నారు. ఈ సమయంలో మీ మనస్సుకి ఏదైనా ఆలోచనలు వచ్చినా వాటి గురించి పట్టించుకోకుండా నామ జపం కొనసాగించమన్నారు.
ఆ రోజు మధ్యాహ్నం మూడు గంటలలోపు మెహెరాబాద్ కొండపైన అందర్నీ హాజరుకమ్మన్నారు.
ఆ సమయంలో ముందుగానే నిర్మించిన బాబా సమాధిని చూపెడతామన్నారు.
అనంతరం, ధుని వెలిగించే ప్రాంతానికి వెళ్ళారు. అక్కడే పేదల సేవా కార్యక్రమం కూడా జరుగుతోంది. సుమారుగా రెండు వందల మంది పేదలకు పాదాలు కడిగి నాలుగు రూపాయలు బాబా దక్షిణగా ఇచ్చారు.
ఎంపిక చేసిన పేదల పాదాలు కడిగేందుకు ఒక ప్రత్యేకమైన ఎత్తైన పీటను తయారుచేయించారు. పాదాలు కడిగి శుభ్రమైన టవలుతో తుడిచి, వారి పాదాలపై బాబా తన శిరస్సు వుంచి నమస్కరించారు.
ఇలా పేదల కార్యక్రమం కొనసాగుతుంటే బాబా వున్న ఫళంగా మధ్యలో ఆపి స్టూలుపై నిలిచున్న పేదవాడిని చూపిస్తూ సహవాససీలకు పరిచయం చేశారు.
అతని పేరు సత్యమాంగ్ అని చెప్పారు.
ఒకప్పుడు గొప్ప పేరు మోసిన గజదొంగ సత్యమాంగ్ అని, అతని కథను గుర్తుచేశారు.
ఎన్ని కష్టాలు ఎదురైనా అతను బాబాకిచ్చిన మాట ప్రకారం దొంగతనాలు తిరిగి చేయలేదని బాబా అన్నారు.
అవతారుని దైవీ ప్రేమతో ఒక మంచి మనిషిగా మారిన గజదొంగను చూసి సహవాసీలందరూ ఆశ్చర్యపోయారు. అనంతరం ప్రేమికులందరినీ మధ్యాహ్న భోజనానికి పంపారు.
బాబా తన భోజనం ముగించుకొని సహవాస్ ఏర్పాట్లలో నిమగ్నమైన స్థానిక ఆరంగాం పనివారందరికీ స్వయంగా భోజనం వడ్డించారు.
ఆ తర్వాత బాబా ఆదీ కారులో మెహెరాబాద్ కొండపైకి వెళ్ళారు.
పాశ్చాత్య బాబా ప్రేమికురాలు **మిల్‌డ్రెడ్ కైల్** కొద్ది నెలల క్రితం అమెరికాలో మరణించింది.
ఆమె తాలూకు అస్థికలను ఎలిజబెత్ పాటర్‌సన్ మెహెరాబాద్‌కు పంపింది.
దిగువ మెహెరాబాద్ నుండి సహవాసీ గ్రూపు అందరూ రాకమునుపే డాన్ స్టీవెన్స్ సమక్షంలో బాబా సమాధి ప్రక్కనే ఆమె కోసం ప్రత్యేకంగా

ఏర్పాటు చేసిన సమాధిలో ఆ అస్థికలను వుంచారు.
ఆ పిదప విచ్చేసిన ప్రేమికులందరికీ వాటర్ ట్యాంక్ ప్రాంతంలో
బాబా నిర్వహించిన ఏకాంత వాసం,
టిన్ క్యాబిన్, బాబా సమాధులను చూపించారు.
సమాధి లోపల బాబా 1927 ప్రాంతంలో సుమారు ఆరు మాసాలు ఏకాంతవాసం
గడిపిన విశేషాలను ఏరుచ్ వివరించాడు.
ఆ తర్వాత 1940-41 ప్రాంతంలో వెదురు బొంగులతో చేసిన గదిలో
బాబా గడిపిన ఏకాంతవాసపు గదిని చూపించారు.
ఈ ప్రాంతంలో అత్యంత కఠినమైన
ఏకాంతవాసం బాబా గడిపారు.
ఈ సమయంలో బాబా నీడను కూడా మండలివారు
చూడరాదని నిషేదించారు.
ఈ వెదురు గదికి వున్న చిన్న కిటికీ ద్వారా బాబా అక్షర ఫలకంపై చూపించే ఆదేశాలను
మండలి సభ్యుడు విష్ణు మాష్టరు బాబాను చూడకుండా అమలుచేసేవాడు.
ఆ తర్వాత అందరూ సాయంత్రం 4.15 సమయంలో
బాబాతో కలిసి మండలి హాలుకు చేరుకున్నారు.
పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రేమికులు
తమ అనుభవాలు, అనుభూతులు వివరించారు.
ఎలిజెబెత్, నోరినా, కిట్టీ డేవిడ్ తదితర పాశ్చాత్య వనితల విధేయత, ప్రేమ,
అంకిత భావాలను బాబా వివరించారు.
నా పట్ల విధేయతగా వుండటమంటే అంత సులువైన
విషయం కాదన్నారు బాబా. నా దగ్గరకు వచ్చి రెండు చేతులూ జోడించి
దణ్ణం పెట్టుకుని వెళ్ళిపోతారు.
అది నాయందు మీకు గల ప్రేమ, విధేయత అనుకుంటారు.
కానీ, అది విధేయత ఏమాత్రం కాదు.
నాపట్ల విధేయులుగా వుండటం
చాలా కష్టమైన విషయం.
మీలో ఎవరినైనా నడి రోడ్డుపై నగ్నంగా నడవమని
నేను ఆదేశిస్తే, మారు మాట్లాడకుండా నడవగల్గుతారా? అని బాబా ప్రశ్నించారు.
అనంతరం, మెహెరాజాద్‌కు సాయంత్రం 4.45 ప్రాంతంలో తిరిగి వెళ్ళారు.

**- సశేషం**

# పావగడ రజతోత్సవాలు

## పి.ఎస్.కె. శర్మ



కర్ణాటక - ఆంధ్ర రాష్ట్రాల సరిహద్దులో ఉన్న పావగడ గ్రామంలో బాబా సెంటర్ స్థాపించి 25 సంవత్సరాలు నిండిన సందర్భంగా రజతోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా 2014 జూన్ 3,4,5లలో జరుపుకున్నారు.

ఇక్కడ బాబా కేంద్రాన్ని చిన్న కొండపై నిర్మించారు. కొండ క్రింద పెద్ద గ్రామం వుంది.

సెంటర్ ప్రక్కనే వున్న ఖాళీ జాగాలో స్థానిక మున్సిపాలిటీవారి కమ్యూనిటీ హాలు వుంది. ఈ కమ్యూనిటీ హాలు నిర్వహణ బాధ్యత కూడా బాబా కేంద్ర కార్యదర్శికి అప్పగించారు. ఇక్కడ సెంటరును శ్రీ రాజానాయుడు స్థాపించారు.

మెహెరాబాద్ నుంచి శ్రీ మెహెర్‌నాథ్ కల్చూరీ, రమేష్ జంగ్లీ, పి.సి. నిగమ్, శ్రీమతి నీలుమతి పాంచాల్ విచ్చేసారు. అహ్మద్‌నగర్, హమీర్‌పూర్, పూనే సెంటర్, ధర్మవరం, హిందూపురం ప్రేమికులు భజన గీతాలు ఆలాపించారు. శ్రీమతి సుబ్బలక్ష్మి, శ్రీ బి. రామకృష్ణయ్య, శ్రీ ప్రసాదరాజు ఈ కార్యక్రమంలో బాబా సందేశాలపై ప్రసంగించారు. ఇక్కడ బాబా కార్యక్రమాలు 18-25 సంవత్సరాల మధ్య వయస్సు వున్న యువత నిర్వహించడం ఓ విశేషం. ఇది పావగడ సెంటర్ ప్రత్యేకత. హమీర్‌పూర్ ప్రేమికుల మాదిరి ఇక్కడ యువత అత్యంత సేవా భావంతో బాబా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని పలువురు అభిప్రాయపడ్డారు.

రజతోత్సవాల సందర్భంగా ప్రచురించిన ప్రత్యేక సావనీర్‌ను శ్రీమతి నీలుమతి పాంచాల్ ఆవిష్కరించారు. బాబాకు అత్యంత ఇష్టమైన హాఫీజ్ సూక్తులను

శ్రీ రమేష్ జంగ్లీచే ఆవిష్కరింపజేశారు.

ఈ సహవాస్ కార్యక్రమంలో పలువురు వక్తలు బాబా సందేశాలపై ప్రసంగించారు. మెహెర్‌నాథ్ కల్చూరీ తన ప్రసంగంలో మెహెర్‌బాబా మిమ్మల్ని ఏరికోరి ఎంచుకునేలా బాబా కార్యక్రమాలను నిర్వహించాలని అన్నారు. ఈ విషయాన్నే ఆయన మరింత వివరంగా, ఒక చక్కని మనస్సుకు హత్తుకునే యదార్ధ సంఘటనతో చెప్పారు. అది 1920వ దశకం. మెహెరాబాద్‌లో బాబా ఆశ్రమ బాలుర ఆశ్రమ స్కూలు నిర్వహిస్తున్న రోజులవి. మండలి సభ్యుడైన విష్ణు మాష్టరు ఆశ్రమ స్కూల్‌లో టీచరుగా పనిచేస్తున్నాడు. స్కూలు నియమాల ప్రకారం అక్కడ చదువుకునే పిల్లల ఆరోగ్యం గురించి కూడా టీచర్లు పర్యవేక్షిస్తుండాలి.

అలా ఒక రోజున ఒక విద్యార్థికి విష్ణు మాష్టరు

తగిన సమయంలో తాను ఇవ్వాల్సిన మందుని

ఒక తోటి విధ్యార్థికి అప్పజెప్పి

తాను మరో పనిమీద బయటకి వెళ్ళాడు.

ఆ కుర్రాడు ఒక మందుకి బదులు మరొకటి ఇవ్వడంతో రోగం వికటించింది.

ఈ విషయాన్ని అర్జున్ అనే మరో టీచరు బాబా చెవిన వేశాడు.

బాబా కోపంతో పిల్లల ఎదురుగా అర్జున్ చేత విష్ణు మాష్టరు చెంప చెళ్ళుమనిపించాడు.

దీంతో విష్ణు మాష్టరు, తానిక ఆశ్రమ స్కూల్లో పని చేయలేనని

నేరుగా బాబాతో చెప్పి వేగంగా అడుగులు వేస్తూ ఆరుబయలుకు వచ్చేశాడు.

అతని వెనకాలే బాబా కూడా వేగంగా అడుగులు వేస్తూ విష్ణు మాష్టర్‌ను

నిలువరించ ప్రయత్నించాడు.

నేను చేసిన చిన్న తప్పుకి, పిల్లల ఎదురుగా అవమానించడం తగదన్నాడు

ఆతను బాబాతో. తానిక్కడ పని చేయలేనని విష్ణు మాస్టర్ చాలా స్పష్టంగా

బాబాతో చెప్పాడు.

తనకిక భగవంతుడు వద్దు,

మోక్షం వద్దు,

భక్తి వద్దు, ముక్తి వద్దని గట్టిగానే బాబాతో అన్నాడు.

నన్నిక వదిలిపెట్టండని, వెళ్ళిపోతానని బాబాతో ప్రాధేయపడ్డాడు.

అందుకు బాబా అంగీకరించలేదు.

పిడికిలితో విష్ణుని పట్టుకుని తిరిగి తన మండలి హాలులోకి తీసుకెళ్ళారు.

విష్ణు మాష్టరు వెక్కి వెక్కి ఏడ్చుకుంటూ బాబాను అనుసరించాడు.

ఆ పిదప బాబా ప్రేమకు దాసుడయ్యాడు.

మనస్సు కుదుటజేసుకున్నాడు.

ఈ కథనం చెప్పిన మెహెర్‌నాథ్,
బాబా తన ప్రేమికులను ఎన్నటికీ వదిలిపెట్టరన్నారు.
మీరు బాబాను వదిలించుకుందామన్నా,
బాబా తన ప్రేమికులను వదలడని,
అవతారుడ్ని ప్రేమించి, తరించాలని మెహెర్‌నాథ్ అన్నారు.

***

పూణే నుండి వచ్చిన అనంత బాస్కర్ అనే బాబా ప్రేమికుడు
మీ కోరికలు బాబాకు చెప్పుకోవల్సిన పనిలేదు.
మీరు అడిగినా, అడగకున్నా,
బాబా తన ప్రేమికుల అవసరాలను తీరుస్తాడని,
తన వ్యక్తిగత అనుభావాన్ని ఇలా చెప్పారు.
"తాను పూణేలో ఇళ్ళకు ఎలక్ట్రికల్ వైరింగ్ చేస్తుండేవాడినన్నాడు.
ధనవంతుల ఇళ్ళకు వైరింగ్ చేస్తుండేవాడినన్నాడు.
అది 1940 నాటి విషయం కదా!
ఆ రోజుల్లో గొప్పవాళ్ళ ఇళ్ళకే కరెంటు సౌకర్యం వుండేది.
ఇదిలావుంటే, ఒక రోజున పూణేలోని బాబా ప్రేమికుడుఒకరు
తనని మెహెరాబాద్‌లో బాబావారి ఇంటికి ఎలక్ట్రికల్ వైరింగ్ పనికి
పురమాయించాడన్నారు. బాబా దగ్గరకి ఆయన తన కారులో తీసుకెళ్ళి,
బాబాకి పరిచయం చేసి, ఆ పనిని అప్పగించారు.
అక్కడ వాతావరణమంతా మౌనంగా వుంది.
ఆ ఇంటి పెద్దాయన మూగవాడనుకున్నాను.
ఆ చుట్టుప్రక్కలవారందరూ కూడా మాటలు తక్కువగానే మాట్లాడుతున్నారనుకున్నాను.
తాను చేస్తున్న పనికి కూలీ ఇస్తారో లేదో అనే అనుమానం కూడా నాలో కలిగింది.
ఏమయితేనేమి ఇచ్చిన పనిని పూర్తిచేసి, తిరిగి పూణే చేరుకున్నాను.
ఆ దరిమలా, కొద్దిరోజుల్లోనే స్థానిక మహారాష్ట్ర గవర్నమెంటు నుండి
ప్రభుత్వ ఉద్యోగం వచ్చినట్లు ఆర్డర్లు వచ్చాయి.
అప్పటిదాకా ఏ రోజుకారోజు కూలీ వెదుక్కునే నాకు,
ఒక స్థిరమైన నెల జీతంతో గవర్నమెంటటు ఉద్యోగం లభించడం
మెహెర్‌బాబా ఆశీర్వాదం వల్లనేనని నా నమ్మకం.
ఆ దరిమలా ఆయన ప్రేమకు అంకితమయ్యానని శ్రీ అనంత భాస్కర్
తన గురించి చెప్పారు.

# ముగిసిన యువజన సమ్మేళనం

జూబ్లీహిల్స్ హైదరాబాద్ బాబా సెంటర్‌లో రెండు రోజుల యువజన సమ్మేళనం మే 17, 18లలో ఘనంగా జరిగింది. 18-35 సంవత్సరాల వయస్సు గల యువత 50 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మెహెర్‌బాబాను 1950వ దశకంలో దర్శించుకున్న శ్రీ ఎస్వీఎస్ సత్యన్నారాయణ మెహెర్‌బాబా చిత్రపటానికి పూలమాల వేసి, బాబా సందేశాలపై ప్రసంగించారు. అనంతరం, మెహెర్‌బాబా యువతకు ఇచ్చిన పలు సందేశాలను శ్రీ నోరి సూర్యనారాయణ చదివి వినిపించారు. శ్రీ బి. రామక్రిష్ణయ్య, శ్రీ తోట నాగేశ్వరరావు, శ్రీ పి. రాజేంద్ర మెహెర్, శ్రీ డి.వి.బాలక్రిష్ణ మెహెర్, శ్రీ ప్రశాంత్ ఆహిర్, శ్రీ యం.వి.ఆర్.కె. బాలాజీ తదితరులు యువతను ప్రోత్సహించేలా ప్రసంగించారు. ప్రధానంగా ఈ రెండ్రోజుల సమావేశంలో

**1. కొత్తవారికి మెహెర్‌బాబాను ఎలా పరిచయం చేయాలి?**

**2. వ్యక్తిగత కార్యక్రమాలకు హాజరవుతూ.. ...ఆధ్యాత్మిక విషయాలపై అవగాహన ఎలా పెంపొందించుకోవాలి, 3. మెహెర్‌బాబా సాహిత్యం చదవవలసిన ఆవశ్యకత,**

**4. మెహెర్‌బాబా సెంటర్ కార్యక్రమాలలో ఎలా చురుకుగా పాల్గొనాలి,**

ఇలా పలు ఆసక్తికర అంశాలపై చర్చలు, ప్రసంగాలు, ప్రెజంటేషన్లు నిర్వహించారు. కమ్యునికేషన్ స్కిల్స్ ఆవశ్యకత గురించి కూడా ఈ సహవాస్‌లో చర్చించారు.

ఈ అంశాలపై కేవలం ప్రసంగాలకే పరిమితం కాకుండా యువతకు ఆసక్తికరమైన అనేక పోటీలను నిర్వహించారు. బహుమతులు అందజేశారు.

జూబ్లీహిల్స్ సెంటర్ ఆదివారం కార్యక్రమాన్ని ఉదయం 10 నుండి 12.30 వరకు ఈ సహవాస్‌లో పాల్గొన్న యువత తమదైన నూతన ఒరవడిలో చక్కగా నిర్వహించారు. యువత పాటలు పాడారు. సంగీత నృత్య నాటకలు ప్రదర్శించారు.

**"అవతారుని ఇచ్ఛను"** రోజువారీ కార్యక్రమాలలో పాల్గొంటూ ఎలా అమలుపరచాలి? బాబావారి సందేశాలను సామాన్య ప్రజానీకానికి ఎలా అందించాలి? అనే విషయంపై ఆసక్తికరంగా యువత ప్రసంగించి నాడు హాజరైన ఎందరో పెద్దల మనస్సులు దోచుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీయుతులు నర్సి, కల్యాణ్ మెహెర్, ప్రసన్న కుమార్, సోమశేఖర్, పి.యస్.కె.శర్మ, మెహెర్ వాణి, రంగ లక్ష్మి, టి.వి.సుబ్బారావు, మెహెర్‌చంద్ నోరి, అజయ్ బాబు, క్రాంతి మెహెర్ ఇలా పలువురు స్థానిక బాబా ప్రేమికులు పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ హైదరాబాద్ బాబా సెంటర్ వారు రెండు సంవత్సరాలకు ఒకసారి చొప్పున ఏర్పాటు చేస్తున్న ఈ యువజన సహవాస్ తెలుగునాట గల ఇతర బాబా సెంటర్లలో కూడా వారి వీలువెంబడి ఏర్పాటు చేయగల్గితే నేటి తరం యువతకెంతో ఉపయోగకరం అని పలువురు అభిప్రాయపడ్డారు. ❋

# కృష్ణనగర్‌లో నూతన బాబా సెంటర్ ప్రారంభం

నిజామాబాద్ నుండి 12 కి.మీ దూరంలో ఉన్న కృష్ణనగర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన బాబా సెంటర్‌ను శ్రీ బి. రామకృష్ణయ్య 25.05.2014న లాంఛనంగా ప్రారంభించారు. స్థానిక బాబా ప్రేమికులు శ్రీ దండమూడి వెంకటేశ్వరరావు గారు విరాళంగా ఇచ్చిన స్థలంలో బాబా సెంటరు సుమారు 20 లక్షల రూపాయల అంచనాలతో నిర్మాణం చేపట్టి పూర్తిచేయడమైంది. చుట్టూతా చక్కని విశాలమైన స్థలంలో పచ్చని చెట్ల మధ్య వున్న ప్రశాంత వాతావరణంలో బాబా కార్యక్రమాలు జరిగాయి. శ్రీ పి.ఎస్.కె. శర్మ, శ్రీ ఎ. జనార్ధనరావు తదితరులు బాబా సందేశాలపై ప్రసంగించారు. కంకల్, నిజామాబాద్, కామారెడ్డి బాబా ప్రేమికుల భజన గీతాలు ఆలాపించారు.

# మెహెర్‌బాబా పత్రిక

ప్రతి నెలా 25లోగా మెహెర్‌బాబా పత్రిక పోస్టులో మీకు అందేలా తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. ఐతే, ఏ కారణంగానో నెల చివరిదాకా కూడా పత్రిక పోస్టులో మీకు రాకుంటే హైదరాబాద్ బాబా ప్రేమికులు శ్రీ కాగిత రామ్ (99481 28207) సంప్రదించగలరు.

**మీ ఇ-మెయిల్ అడ్రస్ పంపితే పత్రికను ఇంటర్‌నెట్‌లో పంపగలం.**
**మెహెర్‌బాబా నామం పలువురికి తెలియజేసేందుకు వీలుగా మీ బంధుమిత్రులలో కనీసం ఒకరిద్దరినైనా ప్రోత్సహించి పత్రికకు వార్షిక, జీవిత సభ్యత్వం చెల్లింపజేయండి. పత్రిక పది వేల సైన్యంతో సమానమని గమనించగలరు.**

1. మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/- (వెయ్యి రూపాయలు).
2. రెండు దఫాలుగా కూడా రూ.500/- చొప్పున చెల్లించవచ్చు.
3. వార్షిక సభ్యత్వం రూ.100/-

# మెహెర్‌బాబా పత్రిక ప్రతినిధిగా

**బాబా సందేశాలపై మంచి రచనలు పంపండి. మీ సెంటర్ తరపున మెహెర్‌బాబా పత్రిక ప్రతినిధిగా మీ పేరు, ఇతర వివరాలు నమోదు చేయించుకోండి. మరిన్ని వివరాలకు ఫోన్ 995 955 3218 సంప్రదించండి.**

# అవతార్ మెహెర్‌బాబా సందేశామృతం




మెహెర్‌బాబా 120వ జన్మదినోత్సవ సందర్భంగా తాడేపల్లిగూడెం, రామారావుపేట బాబా కేంద్రం తరపున 120 సందేశాలు గల “అవతార్ మెహెర్‌బాబా సందేశామృతం” పేరుతో ఒక చిన్న పుస్తకాన్ని ప్రచురించినట్లు డా॥ వై.విజయసారధి, తాడేపల్లి గూడెం, (94403 44104) తెలిపారు. రోజుకొక బాబా సందేశం చొప్పున అవతారుని 120 జన్మదినోత్సవాలలో స్మరించుకోవడం జరిగిందని డా. విజయసారధి అన్నారు.

# అవతార్ మెహెర్‌బాబా 167వ ప్రేమిక సహవాస్

08.06.2014 రెండవ ఆదివారం మెహెర్‌స్థాన్‌లో అవతార్ మెహెర్‌బాబా 167వ సహవాస్ కార్యక్రమము తాడేపల్లిగూడెం, రామారావుపేట బాబా సెంటర్ ఆధ్వర్యంలో జరిపినట్లు డా॥ శ్రీ వై. విజయసారధి, శ్రీ కె. నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.

## నరసన్నపేట సెంటర్

20.04.2014 ఆదివారం, నరసన్నపేట బాబా సెంటర్ వార్షికోత్సవం ఘనంగా జరిపినట్లు శ్రీ కోరడ నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం, నూతన కార్యవర్గ ఎంపిక జరిగినట్లు ఆయన తెలిపారు. రెడ్డి తాతబాబు - గౌ॥ అధ్యక్షులు, శ్రీ వూణ్ణ మెహెర్ ప్రసాద్ - కార్యదర్శి, శ్రీ మొయ్యి భోగేసు - సహ కార్యదర్శి. డైరెక్టర్లుగా శ్రీ మచ్చ శాంతీశ్వరరావు, డా॥ ఎస్.ఎం. ప్రసాద్, శ్రీ కోరాడ శిరీష్, శ్రీ కర్రి షణ్ముఖరావు, శ్రీ డోల పాపారావు. **ప్రవచనకర్తలుగా** - శ్రీమతి యశోదా, పి. చిరంజీవులు, ఎల్. రామకృష్ణ ఎన్నికయినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

## రాజాం బాబా సెంటర్

రాజాం బాబా సెంటర్‌లో **ఆచరణాత్మక ఆధ్యాత్మిక శిక్షణా కార్యక్రమం ప్రతి నాల్గవ** ఆదివారం ఉదయం 10 నుండి 5 దాకా నిర్వహిస్తున్నట్లు వి.రమణమూర్తి,(9440887731) ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ డి. శ్రీనివాసరావు, శ్రీకాకుళం అవతారుని సందేశాలపై ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ఆయన అన్నారు. ఆసక్తిగల ఆధ్యాత్మిక జిజ్ఞాసులందరూ పాల్గొనవల్సిందిగా శ్రీ రమణమూర్తి స్వాగతం పలుకుతున్నారు.



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

**ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్,**
**వాల్యూం-3 (1925-29) - తెలుగుసేత: మల్లాది రామారావ్,**
**న్యూఢిల్లీ**

***(గత సంచిక తరువాయి)***

బాబావారు వాళ్ళని పట్టించుకోలేదు.
మన మిత్రుడి ధర్మ సందేహాన్ని తీర్చారు.
అయితే రెండు అక్షింతలు వేశారనుకోండి.
నువ్వు మూర్ఖుడివి అన్నారు.
నీకు తెలివితేటలు సున్న అన్నారు. నేను ఇంతవరకు ఏమి చెప్పాను -
ఏమి చెప్పాను అంటే దు:ఖం, కష్టం అంటూ ఏమీ లేదు.
నెప్పి, బాధ మనస్సు వల్ల కలుగుతాయి.
ఆ మనస్సు నశిస్తే కష్టం, సుఖం, బాధ, నెప్పి ఏమీ ఉండవు.
అవి అన్నీ మాయమౌతాయి.
ఎందుకంటే, అసలు సృష్టిలో సుఖం, దు:ఖం అంటూ లేనే లేవు.
ఉన్నదల్లా పరమానందం ఒక్కటే.
మనోనాశ్ జరిగితే ఆత్మ పరమానందంలో మునిగి తేలుతుంది.
ఇందుకోసం నువ్వు ఏమి చేయాలి,
మనస్సుని సమూలంగా తుడిచిపెట్టు.
బంధనాలు తెంచుకొని బయటపడు. పరమానందం అనుభవించు.
పరమాత్మలో లీనమైపో, అని వివరించారు.
బ్రహ్మైక్యమంటే ఇదేనన్నారు.
భగవంతునిలో ఏకమవటమే బ్రహ్మైక్యమన్నారు.
ఆలోచనలు, కోర్కెలు, మోహాలు, ఆశలు మనస్సు వల్లనే.
మరి మనస్సు నశిస్తే, పరమాత్మతో ఏకం కాగలుగుతుంది ఆత్మ.
బ్రహ్మైక్యమన్న వరాన్ని పొందుతుంది.
పరమాత్మలో లీనమైపోవాలనుకుంటే రాదు బ్రహ్మైక్యం.
పరమాత్మలో లీనమయిపోతున్నామని ఊహించుకొన్నా దొరకదు ఈ అదృష్టం.
మనోనాశ్ జరిగితేనే ఆత్మ పరమాత్మలో లీనమౌతుంది.

పరమానందం చవిచూస్తుంది అని సాధికారికంగా చెప్పారు.
పరాత్పర పరబ్రహ్మని దర్శించి తరించానని మనిషి తెలుసుకోగలడా?
ఇది మరొకరి ప్రశ్న. బాబావారు ఒక్క మాటతో సందేహ నివృత్తి చేసారు.
పరమాత్మని ఆత్మ దర్శించడం, ఆ అనుభూతి అనుభవంలోకి రావడం అంతా ఒక్కసారే జరుగుతాయి అన్నారు. అది అంతా ఆటోమాటిక్‌గా జరుగుతుందన్నారు.
నీ సంగతే తీసుకో.. నువ్వు మనిషివి.. అరే! నేను మనిషిని అని అనుకుంటావా?
నేను మనిషినేనా అని ఒంటిమీద గిచ్చుకుంటావా?
నీకీ ప్రశ్న రానేరాదు. ఎందువల్ల.. నువ్వు మనిషివి కాబట్టి.
నీకు ఆ అనుమానం, ఆ ప్రశ్న రానే రాదు.
అలానే, భగవత్ సాక్షాత్కార భాగ్యం పొందిన వ్యక్తికి కూడా జరుగుతుంది.
ఒక్కసారి బ్రహ్మైక్యం జరిగాక, నేను భగవంతుడిని అని అనిపిస్తుంది.
ఆ దివ్యానుభూతి పూర్తిగా మీ పరమౌతుంది.
మరి ఇంకా అనుమానాలకి ఆస్కారం వుంటుందా? వుండదు కాక వుండదు అని అంటూ, మరో మాట సెలవిచ్చారు.
భగవంతుడికి, మనిషికి తేడా వివరించారు.
స్వర్గం, భూమికి మధ్య తేడా తెలుసు మీకు.
ఇంతకు మించిన తేడా వుంది మనిషికి భగవంతుడికి మధ్యన అన్నారు.
కోర్కెలు, ఇది కావాలి, అది కావాలి అన్న తపన మనిషిని కట్టిపడేస్తాయి అన్నారు.
ఆకలివేస్తే తింటారు మీరు. దాహం వేస్తే త్రాగుతారు.
ఇలా మీరు చేసే ప్రతి పనివల్ల మీకు బంధనాలు ఏర్పడుతున్నాయి అన్నారు.
తమని అయితే ఆహార, పానీయాదులు బంధించవన్నారు.
ఈ బంధనాలకి అతీతులమని పేర్కొన్నారు.
జంతువులు, మనుషులు కూడా ఆకలివేస్తే తింటారు.
దాహం వేస్తే మంచినీళ్ళు త్రాగుతారు.
అలా అని జంతువులు, మనుషులు ఒక్కటేనా? కాదు కదా!
అలాగే మీకు, నాకు ఎంతో తేడా వుంది.
మీరు సామాన్య మనుషులు, నేను మానవాతీతుడిని, భగవంతుడిని అని వ్యాఖ్యానించారు.
నన్ను నమ్మినా, నమ్మకపోయినా,
ఈ వేళ నమ్మి రేపు నమ్మకపోయినా మీ ఇష్టం.
నాకేమీ పట్టదు అన్నారు.
ఈ వాళ నన్ను నమ్మాడొకడు. నా వెంట వున్నాడు. రేపు మనస్సు మారింది, నా ఇచ్ఛ కాదన్నాడు. నా మాట పెడచెవిని పెట్టాడు.

ఒక్కమాటలో చెప్పాలంటే, ప్లేటు ఫిరాయించి నాపై అభాండాలు మొదలెట్టాడు.
అపనిందలు వేయడం మొదలుపెట్టాడు.
నిన్నే నమ్మాను బాబా అంటున్న వ్యక్తి నాపై భక్తికి తిలోదకాలు ఇచ్చాడు.
అంటే ఏమయింది? ఆ మనిషిలో మార్పు వచ్చింది.
నాలో కాదు. నేను ఎప్పటిలానే వున్నాను.
చలనాచలనాలకి అతీతుడిని.
అందరికీ సమదూరంలోనే వున్నాను.
అద్దం సంగతి తెలుసుగా. అద్దం ముందు నిలబడితే ఏమి కనిపిస్తుంది?
మీ ప్రతిబింబం కనిపిస్తుంది.
అవునా? ఆ మీ రూపం ఎలా వుంటుంది?
నవ్వుతూ మొహం పెడితే నవ్వుతూ కనిపిస్తారు.
కోపంతో ముక్కు పుటాలు ఎగరవేస్తూ వుంటే
అలాగే సీరియస్‌గా కనిపిస్తుంది మీ ముఖం అద్దంలో.
నవ్వితే నవ్వుతూ కనిపిస్తారు.
మరి అదే ముఖం అష్ట వంకర్లు పెట్టి నిలబడితే, అద్దంలోనూ అలానే కనబడతారు.
ఎందువల్ల? అద్దం వల్లనా? కాదు కదా!
అద్దంలో మార్పు వుందా? లేదు.
ముఖం ఎలా పెడితే అలా కనిపిస్తున్నది అద్దం వల్ల కాదు కదా.
నేను అద్దం వంటి వాడిని.
చలనం, మార్పు వుండవు అద్దంలో. ఎప్పుడూ ఒకలానే వుంటుంది అద్దం.
నేనూ అంతే. మార్పల్లా మీలోనే. నాలో కాదు.
నేను నిరంతరుడిని.
కానీ మీరు ఊహించలేరు నా స్థితిని అంటూ
ఆవాల్టి ఉవాచని ముగించారు.
ఈవాళ చాలా విషయాలు మాట్లాడుకున్నాము.
అయితే ఓ సంగతి జాగ్రత్తగా వినండి అన్నారు.
ఈవేళ ఆగస్టు నాలుగు. నేటి నుంచి నా పని ప్రారంభమౌతుంది.
కాబట్టి మీ సమస్యలు నాకు చెప్పి విసిగించకండి.
వంటా, వార్పు గోడు నాకు చెప్పకండి. నిద్ర సరిగా రాకపోతే,
బాబా నాకు నిద్ర పట్టలేదు రాత్రి అని చెప్పవద్దు.
ఇలానే మీకు ఏ ఇబ్బంది వచ్చినా, మీ తిప్పలు మీరే పడండి.
నాదగ్గర మొరపెట్టుకోవద్దు.

అర్ధమయిందా అన్నారు. పాపం మండలివారు ఏం చేస్తారు.
నేనున్నా మీ చెంత అని అభయం పలికే అవతారుడే మీ తిప్పలు మీరు పడండి,
ఏదోరకంగా సర్దుకుపోండి అంటే ఏం చేస్తారు.
అలానే బాబా అంటారు. మన మండలివారు అదే చేశారు.
మీరు చెప్పినట్లే చేస్తాం బాబా అన్నారు.
ఆ వేళ బాబావారిని దర్శించాలని చాలామంది ఉవ్విళ్ళూరారు.
బాబా బస చేసిన చోట గుమిగూడారు.
కానీ, ఎందుకనో, ఏమో, బాబావారు ఇద్దరు, ముగ్గురుకి మాత్రమే దర్శనమిచ్చారు.
మిగిలిన వాళ్ళకి నిరాశ మిగిలింది.
ఏం చేద్దాం అని వాళ్ళు అనుకుంటుంటే,
మండలివారు బాబావారి మాట వాళ్ళ చెవిన వేశారు.
ఇంకా ఇక్కడెందుకు? వెళ్ళండి అని బాబావారు చెప్పమన్నారట.
సరే ఏం చేస్తారు! హతాశులై ఇంటి ముఖం పట్టారు.
ప్రభువు ఇక్కడే ఉంటారుటగా. ఇంకో రోజున దర్శనం ఇవ్వక పోతారా అనుకున్నారు.
ఈ ఆశ అడియాశే అయ్యిందనుకోండి.
అది ఎలా జరిగిందో మీకే తెలుస్తుంది కాస్తంత ఓపిక పడితే.
ఆగస్టు 5వ తేదీన రుస్తుం మళ్ళీ టెలిగ్రాం పంపాడు.
దిక్కుతోచని మాకు దిక్కు చూపవయ్యా,
ఆపద మొక్కులవాడా, స్వామీ అన్నది ఆ టెలిగ్రాం సారాశం.
ఎందుకంటే కైఖుస్రూ మాసా ఆచూకి ఇంకా దొరకలేదట.
కంగారు పడుతున్నారట అందరూ నాసిక్‌లో.
బాబావారు వెంటనే ఇంకో టెలిగ్రాం పంపారు. ఏమనీ, ఏమని అంటే "రుస్తుం!
ఇంకాస్తంత గట్టిగా వెతుకు మాసా కోసం", అని.
టెలిగ్రాం అందగానే రుస్తుం ఏమనుకున్నాడో ఏమోకానీ,
ఇక్కడ హర్వాన్‌లో మండలివారు మాత్రం అయ్యో పాపం! ఎంత కష్టం వచ్చింది
మాసాకి! బంధువుల చెరలో ఎక్కడున్నాడో మాసా అని బాధపడేవారు.
అంత మరీ బాధపడకండి, మీ కోసం కొత్త బాధ ఎదురుచూస్తుంది అన్నట్లు
బాబావారు అన్నారు కదా – నేనిక్కడ 40 రోజులు ఏకాంతవాసం
చేయాలని నిశ్చయించాను. కాబట్టి వంటా వార్పుకి కావల్సిన సరుకు,
సరంజామా తగినంత కొనండి అన్నారు.
బాబావారి ఏకాంతవాసం ఉండేది హర్వాన్ కొండపైన.
కాపలా ఒకరిద్దరు ఉండాలి. పగలు పర్వాలేదు కాని,

రాత్రిళ్ళు అమ్మో! భయం అన్నారు ఛగన్ గారు.
ఎందుకట అంటే, ఈ కొండ ప్రాంతంలో పులులు తిరుగుతుంటాయని విన్నాడు.
పులి – అది బెబ్బులి అయినా, పిల్ల పులి అయిన భయపడనివారు
ఎవరుంటారు కనుక. అయితే బాబావారికి తన భయం వెంటనే చెప్పలేదు.
బహుశా ఆవాళ అవకాశం వచ్చినట్లు లేదు.
మర్నాడు ఆగస్టు ఆరవ తేదీ ఉదయం తొమ్మిదింటికి బాబావారు కొండ ఎక్కారు.
వెంట రావ్ సాహెబ్, రమ్జూ, పిల్లలు కదిలారు.
కుటీరం ఇంచుమించు రెడీ అయ్యింది.
"ఇహ ఆలస్యం దేనికి.
రేపటి నుంచే నా ఏకాంతవాసం" అన్నారు బాబా.
కుటీరం అనండి, పర్ణశాల అనండి, పాక అనండి –
ఏ పేరు పెట్టినా ఆ బాబా గృహం చాలా చిన్నది.
ఒక్కటే గది. బాబావారు నడుం వాల్చడానికి సరిపడినంత జాగా ఉంది.
అంటే ఎంత చిన్న గదో అది పాఠకులు ఊహించుకోవచ్చు.
ఇందులోనే ఉంటానన్నారు బాబా.
గడియ వేసుకొని లోపలే ఉంటానన్నారు.
మరి బయట కాపలా ఉండేవారి సంగతి ఏమిటి?
వాళ్ళకి కాస్తంత నీడ కూడా లేదు.
ఎలా మరి అనుకుంటుంటే, ఏముంది గదికి రెండు వైపులా
చూరులు పెంచండి అన్నారు.
వెంటనే చేయండాపని అన్నారు.
చిత్తం అన్నారు పనివాళ్ళు.
ఇహ ఇప్పుడు బయటపెట్టాడు ఛగన్ గారు తమ భయాన్ని.
ఇక్కడ పులులు స్వైరవిహారం చేస్తుంటాయని ఊళ్ళో చెప్పారు అన్నాడు.
మనిషి వాసన పసిగడితే కుప్పించి లంఘిస్తాయి.
హంఫట్ అంటాయి అన్నాడు. అతని మాటల్లో భయం తొణికిసలాడింది.
నన్ను ప్రమాదం నుంచి కాపాడు స్వామి అన్న ఆర్తనాదం వినిపించింది.
బాబావారు అతని మాటలని పట్టించుకోలేదు సరికదా ఆట పట్టించారు.
ఆ! ఏం చేస్తుంది పులి మహా అయితే నిన్ను భోజనం చేస్తుంది.
నీ జన్మ ధన్యమౌతుంది. ఇంత కాలం నాకు నమ్మకంగా సేవ చేశావు కదా!
నీ కష్టాలకి ఫలితం దక్కిందనుకో పులి భోజనం చేస్తే అన్నారు.
ఛగన్ గారు మరీ బెంబేలు ఎత్తిపోవడం చూసి కాస్త ఊరట చెప్పారు.

'భయపడకు, నేనున్నానుగా" అన్నారు.
ఛగన్ గారికి కాస్తంత ధైర్యం వచ్చింది.
ఆగస్టు 7న కొండపైన ఏకాంతవాసం మొదలైంది.
కొండ ఎక్కేముందు కొన్ని నియమ నిష్టలను బాబావారు చెప్పారు.
నేటి నుంచి ఎవరూ బాబావారిని దర్శించకూడదు.
ప్రభువుని తాక కూడదు.
గుస్తాద్ గారు, బువాసాహెబ్‌లు తప్ప ఇంకెవ్వరూ బాబా కుటీరం
దరిదాపుల్లోకి రాకూడదు. వీరిద్దరిరీ మినహాయింపు ఎందుకంటే
కాపలా డ్యూటీ పెట్టారు వాళ్ళకి కాబట్టి.
ఉత్తరాలు, టెలిగ్రాములు వస్తే వాటిని రమ్జూ తేవాలి.
గుస్తాద్ గారికో, బువాసాహెబ్‌కో ఇచ్చి వెళ్ళిపోవాలి.
బాబావారు పిలిస్తే గుస్తాద్‌గారు కానీ, బువాసాహెబ్ కానీ పలకాలి.
అబ్దుల్లా బాబాతో కుటీరంలో ఉంటాడు.
అయితే భోజనానికి, టీ కి కొండ క్రిందికి వెళ్ళాలి.
అతగాడిని ఎవ్వరూ ముట్టుకో కూడదు.
ఆఘా అలీని, ఆలీ అక్బరుని కూడా తాకకూడదు.
వారిద్దరితో ఎవ్వరూ మాట్లాడకూడదు.
అసలు ఎటువంటి సంబంధం పెట్టుకోకూడదు.
పిల్లల కాటేజీకి పెద్దలు, పెద్దల ఇంటికి పిల్లలు వెళ్ళకూడదు.
బాబాగారు ఏం చెప్పదల్చుకున్నా మండలివారికి ఆ కబురును ఛాన్జీకి చెప్తారు.
అతను అందరికీ చెప్తాడు.
బాబావారికి, రావ్ సాహెబ్‌గారికి రెండు పూటలా భోజనం
ఛాన్జీ పట్టుకు వస్తాడు. పిల్లలకి కూడా భోజనం ఛాన్జీయే తెస్తాడు.
ఖాళీ గిన్నెలు, ఎంగిలి కంచాలు వెనక్కి తీసుకువెళతాడు.
ఈ తొమ్మిది నియమాలను నిష్టతో పాటించమని బాబావారు మండలికి చెప్పారు.
తమ ఏకాంతవాసం ప్రత్యేకతని వివరించారు.
భగవంతుడు వ్యక్తుడు, అవ్యక్తుడు.
అంతటిలోనూ, అన్నింటికీ ఆవల ఉన్నాడు.
అన్నింటిలో అవ్యక్తుడు, అన్నింటికీ అవ్యక్తుడు భగవంతుడు.
ఇప్పుడు ఇక్కడ ఈ హర్వాన్ కొండపైన కూడా అంతే.
నేనూ, అబ్దుల్లా కుటీరంలో ఉన్నాము.
మరి బయట గుస్తాద్‌గారు, బువా సాహెబ్ వున్నారు.

వాళ్ళదీ ఏకాంతవాసమే కదా!
అంటే సగం లోపల, సగం బయట అన్నమాట.
ఏసు ప్రభువుని సమాధి చేసింది ఈ ప్రాంతంలోనే.
ఇక్కడికి దగ్గరగా ఓ గుహ వుంది.
అందులో ఏసుప్రభువు పార్థీవ శరీరాన్ని సమాధి చేసారు.
ఇంతటి స్థల మహత్యం ఉండబట్టే హర్వాన్ కొండని ఏకాంతవాసానికి ఎంపిక చేశామని వివరించారు.
మధ్యాహ్నం మరికొన్ని నిష్టలు, నియమాలు చెప్పారు.
మండలివారికి తమ ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటించమన్నారు.
వాళ్ళు ఎప్పటిలా "సరే బాబా, మీరు చెప్పినట్లే చేస్తాం" అన్నారు.
ప్రొద్దున మండలికి చెప్పిన నియమాలను ఒకసారి చదవండి – పిల్లలు వింటారు అన్నారు. సరే ఆ నియమాలని మండలివారు ఒకరు చదివారు.
పిల్లలు శ్రద్ధగా విన్నారు. ఎదురు ప్రశ్నలు వేయలేదు.
బాబావారు చెప్పినట్లే నడుచుకుంటామన్నారు.
దర్శనం తీసుకోవద్దన్నారు బాగానే వుంది.
తాకను కూడా తాకవద్దు అంటున్నారు –
ఇదేమైనా న్యాయమా అనిపించింది ఆ పిల్లలకి.
బాబావారి దగ్గర గడపటం అలవాటు కదా వాళ్ళకి.
అయితే వాళ్ళు తమ మనస్సులో మాట పైకి అనలేదు.
భక్తుడి ఆంతర్యం ప్రభువుకి తెలియదా!
అందుకనే బాబావారే వాళ్ళ ధర్మ సందేహాన్ని అడగకుండానే తీర్చారు.
ఒకప్పుడు మాట్లాడేవాడిని కానీ మాట్లాడటం మానేశాను.
ఆ దరిమిలా వ్రాయడం కూడా మానేశాను.
ఇప్పుడు మరి డబ్బు ముట్టుకోవడం లేదు.
అయినా సరే ఎంతో మందిని నా దర్శనం చేసుకోనిచ్చాను.
వాళ్ళకి నా ఆలింగనం ప్రసాదించాను.
ఎంతో ప్రేమగా, మహదానందంగా ఇచ్చానీ వరాన్ని.
మీకు ఎన్నోసార్లు చెప్పాను.
ఏమని – ఎప్పుడు అవకాశం దొరికినా నన్ను తప్పక తాకండి అని.
ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోమని చాలాసార్లు చెప్పాను.
సరే మీ అందరికీ అంటే మండలివారికి మరో అవకాశం కల్పిస్తున్నాను.
అందువల్లనే నా దర్శనంతో పాటు నా ఆలింగనం లభిస్తోంది మీకు.

అలసిపోయిన నా పాదాలు ఒత్తుతున్నారు.
అలసిసొలసిన నా కాళ్ళు పడుతున్నారు.
ఇలా ఏదో పేరు పెట్టి నన్ను తాకే భాగ్యం లభిస్తుంది మీకు.
ఈ స్పర్శ, ఈ భౌతిక స్పర్శ అమూల్యమైనది.
దానికి విలువ కట్టలేరు ఎవ్వరూ.
ఈ అవకాశం – నన్ను స్పర్శించి తరించే అవకాశం మున్ముందు
దొరకదని నేను హెచ్చరించాను.
మన్ముందు ఈ అవకాశం కోసం మీరు పరితపించాలి.
ఆర్తితో మొరపెట్టుకోవాలి.
అప్పుడు తెలుస్తుంది మీకు నా స్పర్శ విశిష్టత, ప్రత్యేకత.
కాబట్టి మీ అదృష్టాన్ని పండించుకోండి.
మరి సమయం మించిపోతే బాధపడి లాభంలేదు
అని హితవు చెప్పారు. తమ హిత వాఖ్యం విని కొందరు తమ స్పర్శ చేసి లాభ పడ్డారు. కానీ చాలామంది ఆ సుమధుర అవకాశాన్ని చేజేతులా జారవిడుచుకున్నారని పేర్కొన్నారు. ఇప్పుడు సమయం మించింది అన్నారు.
నలభై రోజుల ఏకాంతవాసంలో తమని ఎవ్వరూ తాకడానికి వీలులేదని స్పష్టం చేశారు. ఈ ఏకాంతవాసం ముగిశాక ఆ అవకాశం మళ్ళీ కల్గిస్తారా?
ఏమో! ఇప్పుడే ఆ సంగతి చెప్పలేమన్నారు.
మీకు నన్ను స్పర్శించే అవకాశం కల్పించవచ్చు,
కల్పించకనూ పోవచ్చు అన్నారు.
నేను అనుకుంటే, భోజనం చేస్తాను.
కాఫీ, టీ వగైరా త్రాగుతాను.
స్నానం కూడా చేయవచ్చు.
అలా చేస్తే, అప్పుడు మిమ్మల్ని తల దువ్వనిస్తాను అన్నారు.
మరి ఈ నిర్ణయం తీసుకోకపోతే అప్పుడు ఏం చేస్తానంటే అన్నీ వదిలేస్తాను.
అన్నీ అంటే వంటిమీద బట్టల్ని కూడా.
లంగోటి కట్టుకుంటాను.
బుద్ధి పుడితే లంగోటీ కూడా తీసిపారేస్తాను.
పూర్తిగా నగ్నంగా కన్పిస్తాను అందరి ముందు.
అదే జరిగితే, నన్ను తాకే ప్రసక్తి లేదు.
నన్ను స్పృశించే అనుమతి ఎవరికీ దొరకదు అని స్పష్టం చేశారు.

–సశేషం

# వివాహాలు

శ్రీమతి & శ్రీ దుప్పాడ సింహాచలం - చిన్నమ్మడు గార్ల పుత్రుడు చి॥ గణపతి నాయుడు వివాహం చి॥ల॥సౌ॥ స్నేహతో 21.06.2014 శనివారం ఉదయం గం. 11.01 ని॥లకు శ్రీ రమా సత్యన్నారాయణ స్వామి కళ్యాణమండపం, వీరఘట్టం రోడ్, పాలకొండ, శ్రీకాకుళం జిల్లాలో జరుపుతున్నట్లు ఆహ్వానం పంపారు.

*****

శ్రీమతి & శ్రీ మంత్రిప్రగడ సత్యబాపిరాజు బాలసరస్వతి గార్ల పుత్రుడు చి॥ వరహాలరావు వివాహం చి॥సౌ॥ పద్మ శకుంతలాప్రియాంకతో 17.05.2014 శనివారం రాత్రి గం. 9.54 ని॥లకు శ్రీ లక్ష్మి శ్రీనివాసా కళ్యాణమండపం, చిట్టివలసలో జరుపుతున్నట్లు ఆహ్వానం పంపారు.

*****

కీ॥శే॥ ఆవుల అలివేలు, శ్రీ ఆవుల చంద్రమోహన్ గార్ల ఏకైక పుత్రిక చి॥ల॥సౌ॥ స్వాతి వివాహం చి॥ లోకేంద్ర ఫణికుమార్‌తో 31.05.2014 శనివారం రాత్రి గం. 10.35 ని॥లకు నోమా కళ్యాణవేదిక, హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. శ్రీ ఓం ప్రకాశ్, శ్రీ నోరి సోదరులు, శ్రీ పిడుగు అప్పారావు, శ్రీ మురళి తదితర బాబా ప్రేమికులు హాజరయ్యారు.

*****

శ్రీమతి పద్మావతి, శ్రీ చంద్రశేఖర్ గార్ల పుత్రిక చి॥ల॥సౌ॥ నాగశ్రీ వివాహం చి॥ కిషోర్ కుమార్‌తో 15.06.2014 ఉ. 11.45 శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మండపం, శ్రీనగర్ కాలని, శ్రీ సత్యసాయి నిగామము ప్రక్కన, హైదరాబాద్‌లో జరుపుతున్నట్లు ఆహ్వానం పంపారు.

# పి.ఎస్.ఎన్. రాజు బాబాలో ఐక్యం

పశ్చిమ గోదావరి జిల్లా, జిన్నూరు గ్రామ వాస్తవ్యులు, ప్రముఖ బాబా ప్రేమికులు శ్రీ పైన్మెత్స సూర్యనారాయణరాజు 19.03.2014న తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు, నల్గురు కుమార్తెలు గలరు. 1960లో బాబాను గురించి తెలుసుకుని, ఆ పిదప బాబాతో నేరుగా ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపాడాయన. ప్రాక్ పశ్చిమ సమావేశాల సమయంలో ఆయన తొలిసారిగా బాబా దర్శనం చేసుకొన్నారు. అనంతరం, స్వగ్రామంలో బాబా జన్మదినోత్సవము, నగర సంకీర్తనలు వైభవంగా నిర్వహించి బాబా నామ వ్యాప్తికి విశేషంగా తోడ్పడ్డారు. కడదాకా బాబా నామ స్మరణలో గడిపి, తుది శ్వాస విడిచిన ధన్యజీవి. ...**కె.ఎల్.యం. కృష్ణమూర్తి, మండపేట**

# ఎన్వీయస్ సత్యన్నారాయణ



బాబా ప్రేమికలోకంలో ఆ బాలగోపాలానికి చిరపరిచితులు శ్రీ ఎన్.వి.యస్. సత్యన్నారాయణ ఆయన ప్రతి మాటలో హాస్యం నిండి వుంటుంది. 'ముక్కు మీద కోపం అంటారే'– ఆ మాదిరి ఒకప్పుడు ముక్కోపిని. మాటవరసకి ఎవరైనా కులాసాగా వున్నారా? అని అడిగితే, రోగం వచ్చిందని ఎవరైనా చెప్పారా? అని ఎదురు ప్రశ్న వేసేవాడిని. ఒక్కొక్కప్పుడు మా తల్లి తండ్రులు కూడా పలకరించడానికి భయపడేవారు. ఈ కోపిష్ఠితో మనకెందుకులే అని చాలామంది నా నుండి దూరంగా వెళ్ళిపోయేవారు! అలాంటిది – బాబా దర్శనం తర్వాత, కోపం పోయింది. హాస్యం అలవడింది అన్నారు శ్రీ ఎన్వీఎస్. అదెలాగంటారా?లోపలి పేజీల్లో పరిశీలించండి!!

నాకు బాబాలు అంటే గిట్టేదికాదు. చదువుకునే రోజుల్లో మా మాస్టారొకరు ఆవలిసూ కూడా **"కుసుమ బాబా"** అంటుండేవారు. ఆయన **'కుసుమ హర్‌నాథ్ బాబా'** భక్తులు. ఆయన అలా అంటున్నప్పుడు గొప్ప చిరాకు వేసేది. మెహెర్‌బాబా గురించి తొలిసారిగా విన్నప్పుడు కూడా **"నేను భగవంతుడను"** అని ఆయన చెప్పుకుంటాడేమిటని ప్రశ్నించాను. ఆ మాట మనం చెప్పాలి కదా? అని వేళాకోళంగా మాట్లాడాను.

బాబా ఫోటో ఇస్తే, తిరిగి కనపడని చోట గిరవాటేశాను. అంతెందుకు, 1953లో మెహెర్‌బాబా కాకినాడలో ప్రజాదర్శనం ఇస్తున్నారు.

ఆ దర్శన కార్యక్రమం మా ఇంటి నుండి అర కిలోమీటరు దూరం కూడా లేదు. ఆ రోజు మహా శివరాత్రి పండుగ. శివుని దర్శనం కోసమని, కాకినాడ నుండి, 20 కిలోమీటర్ల దూరంలో వున్న కోటిపల్లి శివాలయానికి సైకిల్ తొక్కుకుంటూ వెళ్ళాను. అంతేకానీ, కూతవేట దూరంలో వున్న బాబావారి దర్శనం చేసుకోలేదు. అలాంటి ఎన్వీఎస్ గత ఆరు దశాబ్దాలుగా అవతారునికే అంకితమై, అవతారుని నామవ్యాప్తికి అలుపెరుగకుండా కృషిచేస్తున్నారు. ఆ వివరాలు – పై ప్రశ్నలకు జవాబులు, శ్రీ ఎన్వీఎస్ గారి మాటల్లోనే ఇకపై పరిశీలిద్దాం!!

*****

'బాబా' అనే పదాన్ని నేను ఇష్టపడేవాడిని కాదు.
చదువుకునే రోజుల్లో మా మాస్టారొకరు ప్రతి మాటకీ మధ్య, ఆవలిస్తూ కూడా 'కుసుమ బాబా' అంటుంటే గొప్ప చికాకు వేసేది.
అలాంటిది మా అన్నయ్య కామేశ్వరావు తాడేపల్లిగూడెం నుండి అహ్మద్‌నగర్ బాబావారి దర్శనం కోసం 1954లో వెళ్ళాడు.
మా అన్నయ్య అసిస్టెంట్ ఇంజనీర్‌గా తాడెపల్లిగూడెంలో పనిచేసేవాడు.
బాబా ప్రేమికులు శ్రీ ధర్మారావు నాయుడు రాజమండ్రితో కలిసి బాబా దర్శనార్థం వెళ్ళాడు. తాడెపల్లిగూడెం-రాజమండ్రిల నుండి బయల్దేరిన వీళ్ళందర్నీ మెహెర్‌బాబా ఫలానా రైలుకి మాత్రమే బయల్దేరి రమ్మనమని ఆదేశించారు.
వారందరూ ఆ మాదిరిగానే వెళ్ళారు.
ఈ మాట ఎందుకు చెప్తున్నానంటే, వీళ్ళు వెళ్ళిన తర్వాత ఆ మార్గంలో వెళ్ళిన మరో రైలు పట్టాలు తప్పి ఘోర ప్రమాదానికి గురయింది.
బాబా దర్శనం చేసుకుని తిరిగొచ్చిన మా అన్నయ్య
మా అన్నదమ్ములందరికీ బాబా ఫోటోలు,
బాబా గురించిన పుస్తకాలు తీసుకొచ్చాడు.
నేను వాటినన్నింటినీ తిరిగి కనపడకుండా దాచేశాను.
"మెహెర్‌బాబా తనకు తాను భగవంతుడనని ఎలా చెప్పుకుంటాడని? ప్రశ్నించాను.
అదే నిజమైతే, ఆ మాట మేం చెప్పాలి కదా, అని నేను వాదించేవాడిని.
1953లో కాకినాడలో బాబా ప్రజాదర్శనం ఇచ్చారు.
వేలాదిమంది అవతారుని దర్శనం చేసుకున్నారు.
ఆ రోజు మహాశివరాత్రి పర్వదినం.
శివుని దర్శనం కోసమని, సైకిల్ త్రొక్కుకుంటూ కాకినాడ నుండి 20 కిలోమీటర్ల దూరంలో వున్న కోటిపల్లి శివాలయానికి వెళ్ళాను.
ఊర్లో దర్శనమిస్తున్న సాక్షాత్తూ పరమేశ్వరుడ్ని వదలి వెళ్ళానని ఇప్పుడనిపిస్తుంది.
ఆ తర్వాత మా అన్నయ్య వాళ్ళ ప్రభావం వల్లనో ఏమో,
బాబా ప్రేమికులు యల్లాపంతుల జగన్నాథం గారు రాసిన బాబా జీవితచరిత్ర చదివాను.
ఆ తర్వాత మరికొంత బాబా సాహిత్యం చదివాను.
దాంతో నాలో కొంత మార్పు వచ్చింది.
కాకినాడ దగ్గరల్లోని సర్పవరంలో బాబా నామజపం ఏకాహంగా చేస్తుంటే అందులో పాల్గొన్నాను. **పరబ్రహ్మ - పరమాత్మ** అని ఏకనామం 24 గంటల పాటు చేశారు. ఇదీ అవతారుని ఆదేశాల మేరకు ఆనాడు నిర్వహించారు.
ఆ తర్వాత 1955లో మెహెరాబాద్‌లో బాబా దర్శనం ఇస్తున్నారని

ఆసక్తిగలవారి పేర్లు పంపమన్నారు.
మా నాన్న గారితోపాటు, నాపేరు, శ్రీ అచ్యుత రామరాజుగారి పేరూ ఇచ్చాం.
అచ్చుత రామరాజు గారంటే, ప్రస్తుతం ఆంధ్రా సెంటర్ కార్యదర్శి శ్రీ ప్రసాదరాజు గారి తండ్రి. మేం పంపిన పేర్లు అన్నింటినీ బాబా పరిశీలించి,
అర్హులైన వారిని మాత్రమే ఆ సహవాస్‌కు పిలిపించారు.
ఆ మాదిరిగా ముందుగా మా నాన్నగారి పేరుతోపాటట,
నా పేరూ అంగీకరించినట్లు బాబా నుండి జాబు వచ్చింది.
కొద్దిరోజుల తర్వాత రాజు గారి పేరు కూడా వచ్చింది.
రాజు గారి పేరున జాబు రావడం సుమారు ఒక వారం ఆలస్యం కావడంతో
ఆయన్ని పిలవలేదేమోనని మేం కూడా కంగారు పడ్డాం.
ఆ మాదిరిగా తొలిసారిగా 1955 నవంబరులో
మెహెర్‌బాబాను మెహెరాబాద్‌లో దర్శించుకున్నాను.
సహవాస్ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5 గంటల దాకా ఉండింది.
పెద్ద సర్కస్ టెంట్‌లాగా అతిపెద్ద టెంట్‌ని మా బస ఏర్పాటుగా వేశారు.
మేం అందరం సుమారు 200 మంది ఉన్నాం.
అందరికీ మంచాలు – పరుపులు ఇచ్చారు.
ఉదయం స్నానాలకు వేడినీళ్ళు ఇచ్చారు.
తెలుగు ప్రాంతం నుండి వెళ్ళిన వంటవాళ్ళ చేత రుచికరమైన వంటకాలు వడ్డించారు.
వారంరోజులు బాబా సన్నిధిలో వున్నాం.
ఒక్కమాటలో ఆనాటి సహవాస్ గురించి చెప్పాలంటే
**'అతిథిని ఎలా గౌరవించాలి'** అనే విషయాన్ని తేటతెల్లంజేసేలా
బాబా మండలి మాకు ఆతిథ్యం ఇచ్చింది.
తొలిరోజున అవతారుని దర్శనంతో మా కళ్ళు చెమ్మగిల్లాయి.
నా మటుకయితే – కరెంటు ప్రసరిస్తున్న రాగి తీగపై కాలు పెట్టినట్లయ్యింది.
పెద్ద షాకు తగిలిట్లైంది. కోటి సూర్యకాంతులు ప్రసారమవుతున్నట్లు దేదీప్యమానంగా అవతారుని దివ్యమంగళ దర్శనం లభించింది.
మెహెరాబాద్‌కి వస్తూనే బాబా ముందుగా బాత్రూంలు, టాయిలెట్లు, వంటశాలలో పరిశుభ్రత ఎలా వుందో చూసుకుని, సమావేశ మందిరంలోకి వచ్చేవారు.
మెహెరాబాద్ మండలిహాలులో బాబా ఎదుట మేమందరం కూర్చున్నాం.
ప్రతిరోజూ బాబా సందేశాలు, అనేక అంశాలపై అవతారుని ప్రవచనాలు,
మధుసూదన్ బృందం పాటలు, భజనలున్నాయి.
విచ్చేసిన ప్రేమికులందరికీ బాబా ఆలింగన భాగ్యం ఇచ్చారు.

## వెండి పాదుకలు

అవతారుని దర్శనానికి వెళ్తున్నాం కదా అని, నాతోపాటు ఐదు జతల వెండి పాదుకలు తీసుకెళ్ళాను. మా కుటుంబ సభ్యులం మొత్తం ఐదుగురం. ముగ్గురు అన్నదమ్ములం. ఇద్దరు అప్పచెల్లెళ్ళూను. అందరికీ తలా ఒక జత చొప్పునని,
ఐదు వెండి పాదుకలు తీసుకెళ్ళాను.
మొదటి జత పాదుకలను నా అరచేతిలో వుంచుకుంటే,
బాబా తన పాదాలు వాటిపై వుంచి ఆశీర్వదించారు.
మిగిలిన నాలుగింటిని క్రిందపెట్టమన్నారు బాబా.
ఒక రుమాలుపై ఆ నాలుగు జతల వెండి పాదాలు వుంచాను.
బాబా వాటిపై తన పాదాలు వుంచి ఆశీర్వదించారు.
మా నాన్న గారితో, నాతో మాట్లాడుతూ
**'తనతో మా అనుబంధం ఈ నాటిది కాదని'** సంజ్ఞలతో చెప్పారు.
రామావతారం నుండి అవతారునితో మా సంబంధం వుందని బాబా గుర్తుచేశారు.

## 80 జతలు

కాకినాడ వాస్తవ్యులు శ్రీ చిట్టూరి లక్ష్మణ దాస్ గారు,
బంగారం, వెండి వ్యాపారం చేసేవారు.
ఆయన తనతోపాటు 80 జతల వెండి పాదుకలు తెచ్చారు.
బహుశా వ్యాపారం కోసం తీసుకొచ్చివుండొచ్చు. అవతారునికి అవగతం కానిదేముంది.
శ్రీ చిట్టూరికేసి ఒకసారి చూసిన బాబా, ఆ వెండి పాదుకలన్నింటినీ స్పృశించి,
ఛలోక్తిగా మండలి హాలులో వున్న సహవాసీలందరివైపు ఒక్కొక్కటిగా విసిరారు.
తలా ఒకటో, రెండో చొప్పున కొంతమందికి అవి దొరికాయి.

## ఏలకుల దండ

ఒక ప్రేమికుడు కేరళ రాష్ట్రం నుండి ఏలకులతో దండగా చేసి అవతారుని మెడలో వేశాడు. ఆ తర్వాత బాబా మెడలో వున్న ఆ ఏలకుల దండను నేనే వేశానని మాతో చెప్పాడు. అతను అలా ఆ మాట చెప్పడం ముగిసే లోపలే, మెడలో దండని తీసి బాబా సహవాసీల వైపు విసిరేశారు.

## చెమ్కీ దండ

ఇదీ అలాంటి సంఘటనే.
కాకినాడ చెమ్కీ దండలకు ప్రసిద్ధి. బాబా మెడలో కాకినాడ ప్రేమికుడొకరు తనతో ప్రత్యేకంగా తెచ్చిన చెమ్కీ దండను వేశాడు.

ఆ దండను బాబా మూ్రోజులు వరుసగా వేసుకున్నారు.
ఇది గమనించిన ఆ ప్రేమికుడు, మాతో మాట్లాడుతూ తాను తెచ్చిన చెమ్కీ దండను బాబా గత మూడు రోజులుగా తన మెడలో ధరించారని గర్వంగా మాతో చెప్పుకుని మురిసి పోయాడు. ఆ మర్నాడు బాబా ఆ దండని మెహెరాబాద్‌లో వున్న ఒక మస్తు చేతికి ఇచ్చారు. అతను ఆ దండలోని ఏ దారానికి ఆ దారం పీకి వేసి,
మా కళ్ళ ఎదుటనే రాయి తీసుకుని గట్టిగా కొట్టి పిండి పిండి చేసేసాడు.
నా మటుకు పై రెండు సంఘటనలు చూశాక,
మనలో వున్న "నేను...నాది అనే భావాన్ని నాశనం చేయడమే
అవతారుని కార్యక్రమం కదా!" అనిపించింది.
మెహెరాబాద్ సహవాస్ వారం రోజులు నిర్వహించారు.
ప్రతిరోజూ పూల దండలు కొని డబ్బు వృధా చేసుకోవద్దని మమ్మల్ని
బాబా హెచ్చరించారు. పాపం! ఈ నిర్ణయం వల్ల పూల వ్యాపారులకు
నష్టం వస్తుందని భావించి, బాబా కార్యదర్శి ఆదీ కె ఇరానీని పిలిచి
పూల వ్యాపారులకు ఎంతో కొంత ఇచ్చి పంపమని ఆదేశించారు.

## నా తోడు ..

గుంటూరు నుంచి మెహెర్ ప్రసాద్ అనే ప్రేమికుడు వచ్చాడు.
అతని సమస్యలు బాబాతో చెప్పుకుంటూ.. ఇటీవల కాలంలో తన భార్య చనిపోయిందని చెప్పాడు. తిరిగి పెళ్ళి చేసుకోవడానికి అనుమతి అడిగాడు.
బాబా నిరాకరించారు. రెండో పెళ్ళి వద్దన్నారు.
అలాగైతే నేనెవరినైనా తోడు తీసుకుంటానన్నాడు.
అలాగా! అదేదో – నా 'తోడు' స్వీకరించన్నారు బాబా చమత్కారంగా.
ఆనాటి సహవాస్ విషయాలు చెప్పుకుంటూపోతే ఒక పెద్ద గ్రంధమే
అవుతుందంటూ శ్రీ ఎన్వీఎస్ మరో చమత్కారం చెప్పారు.
విశాఖపట్నం నుంచి వచ్చిన ఒక ప్రేమికుడిని ఎలా వచ్చావని బాబా అడిగారు.
దానికి జవాబుగా తన వ్యావహారిక పరిభాషలో రైలులో, బస్సులో వచ్చానని చెప్పాడు.
అవతారుడు నవ్వుతూ, ఇక్కడకు నిన్ను నా ప్రేమ తీసుకొచ్చిందని గుర్తుచేయడంతో
మేమందరం అవాక్కయ్యాం!!

## బాబాతో ఫోటో

తెలుగు ప్రేమికులందరం బాబాతో బృందాలుగా ఫోటో తీసుకున్నాం.
తీసిన ఫోటోలన్నింటినీ ఎవరి ఫోటో వారికి నామమాత్రపు ధరకి
ఆ మర్నాడు ఇచ్చేవారు. మా కాకినాడ బృందంతో తీసుకున్న ఫోటోకి

ఏమయ్యిందంటే, సూర్యుని వెలుతురు ఎక్కువ కావడం వల్లనో,
ఏమో తెలియదు కానీ, కొందరి ముఖాలపై నల్లని నీడలు కనిపించాయి.
బాబా ఫోటో బాగానే వచ్చింది.
దాంతో మాలో కొందరు తిరిగి బాబాతో ఫోటో తీసుకోవాలనుకున్నారు.
బాబాతో ఈ మాటనే చెబితే, మా ఫోటో తెప్పించుకుని చూసి,
నేను అందంగా.. బాగా కనిపిస్తున్నాను కదా!
మరలా ఫోటో దేనికని ప్రశ్నించారు!!
అంతటితో ఆ ప్రయత్నం ముగిసింది.

## బాబా సమాధి దర్శనం

బాబా మమల్ని దగ్గరుండి,
ఎగువ మెహెరాబాద్‌లో నేడు మనం చూస్తున్న
బాబా సమాధి దగ్గరకి తీసుకెళ్ళారు.
అన్నా ఖండాలే వాళ్ళు కూర్చునే బెంచీలున్న చోట బాబా కూర్చున్నారు.
సమాధి లోపల మనం సాష్టాంగ నమస్కారం చేసే ప్రాంతంలో
లోనికి ఏడు మెట్లుండేవి.
అవి దిగి లోనికి వెళ్ళాం.
అది ఆరడుగుల పైగా వున్న లోతైన ప్రదేశం.
1920వ దశకంలో బాబా అక్కడ ఏకాంతవాసం చేశారు.
**"బాబా సమక్షంలో ఆ ప్రాంతం సందర్శించిన వారంతా అదృష్టవంతులని"**
బాబా అన్న మాటలకు అర్థం మాకిప్పుడు తెలుస్తోంది.

## పింపల్‌గాం

ఈ సహవాస్‌లో చివరి రోజున పింపలగాంకు వెళ్ళాం.
పింపలగాం కొండపై బాబా ఏకాంతవాసమున్న ప్రాంతాన్ని బాబా స్వయంగా
చూపించారు. బాబా ఆ కొండపైభాగానికి చేరాక మాతో
ఎంతో ఉల్లాసంగా ముచ్చటించారు.
ఆ మాటల్లో, అంతక్రితం రోజున నిద్రపట్టని వారెవరైనా వున్నారా? అన్నారు.
అందరూ ఎవరి కారణాలు వారు చెప్పారు.
అందరి మాటలు విన్నాక బాబా –
హమ్మయ్య! నాకు చాలా సంతోషంగా వుందన్నారు.
ఎందుకో తెలుసాండి!!
బాబా పేరు తలుచుకుంటూ రాత్రంతా జాగరణ చేశామని,

ఎవరైనా చెప్తారేమోనని భయపడ్డానన్నారు బాబా నవ్వుతూ !!
ఈ వారం రోజులు సహవాస్‌లో సంపూర్ణంగా తన సాన్నిధ్యంలో వుండమన్నారు బాబా. వాతావరణ మార్పిడివల్ల ఒళ్ళు బడలికలున్నా, జ్వరంలాంటిది వచ్చినా, మీ బసలో పడుకో వద్దు. హాయిగా ఈ సహవాస్ హాల్లోనే వారగా ఓ మూల పడుకోమని సలహా ఇచ్చారు. కూర్చుని కూర్చుని కాళ్ళు నొప్పులుంటే, యధేచ్ఛగా కాళ్ళు జాపుకోమన్నారు. వయస్సు మళ్ళినవారు చాలామంది ఈ సహవాస్‌లో పాల్గొన్నారు. వారి కష్టాలు గమనించి బాబా ఈ ప్రకటన చేశారని నాకిప్పుడు అనిపిస్తోంది. అవతారుని సమక్షంలో ఆనాడు ధుని కార్యక్రమంలో కూడా పాల్గొన్నాం. నెయ్యిలో ముంచిన మంచి గంధపు చెక్కలను ధుని మంటలో వేయమన్నారు. అదే సమయంలో మీ బలహీనతలని కూడా ఆ అగ్నిలో వేయమన్నారు బాబా. మీకు నేను తగిన సహాయం అందిస్తానన్నారు. ధునిలో నా గొప్ప బలహీనతైన కోపాన్ని ఆహుతిచ్చాను. ఆనాటి నుండి కోపం స్థానంలో హాస్యం చోటుచేసుకుంది. అంతక్రితం వరకు నాకు ముక్కోపిగా పేరుండేది. నా తల్లిదండ్రులు కూడా ఒక్కొక్కసారి నాతో మాట్లాడటానికి వెనుకంజ వేసేవారు.
కులాసాగా వున్నారా అని ఎవరైనా అడిగినప్పుడు,
రోగం వచ్చిందని ఎవరైనా చెప్పారా? అని ప్రశ్నించేవాడిని.
అలాంటిది నాలో చాలా మార్పు వచ్చినట్లు నాకే తెలిసొచ్చింది.
ఇది అవతారుని లీలగా నేను భావిస్తున్నాను.
ఇలా చెప్పుకుంటూ పోతే చాలా విషయాలు వున్నాయి.
చివరిగా ఒక చిన్న సంఘటన వివరిస్తాను.
కాకినాడలో వై.వి. నరసింహారావుగారు వుండేవారు.
ఆయన బాబాతో మాట్లాడుతూ తన వంతుగా మూడు ఎకరాల పంట భూమిని ధానంగా ఇస్తానన్నారు. బాబా అడిగారు కదా ఎవరి పేరున ఇవ్వదలిచావ్ అన్నారు. అందుకు జవాబుగా నీ పేరుమీదే బాబా అన్నాడాయన. బాబా అందుకు అంగీకరించలేదు, సరికదా ఎవరైనా పేదలకి పేరు మీద దానం ఇవ్వమన్నారు. పేదలంటే ఎవరో కూడా వివరంగా చెబుతూ భార్యా భర్తలు ఇద్దరూ కష్టపడి నిజాయితీతో బ్రతుకుతున్నా జీవనోపాది కష్టంగా వుండేవారికి దానంగా ఇవ్వమని బాబా అన్నారు. పేదవాళ్ళంటే రోడ్లపై బిచ్చమెత్తేవాళ్ళు కాదని చెప్పకనే చెప్పారు. మూడెకరాల పంట భూమి దానంగా ఇస్తామంటే, నేటి బాబాలు ఎవరైనా వద్దంటారా!! అంటూ తన సహజ హాస్య ధోరణిలో శ్రీ ఎన్వీయస్ పకపకా మరోమారు మమ్మల్ని నవ్వించారు. ఇలాంటి కబుర్లు ఆయన దగ్గర ఇంకా ఎన్నో.
మరో సందర్భంలో మరిన్ని మాటలు మీముందుంచుతాం!! అందాకా జైబాబా!!

# నరసరావుపేట బాబా సెంటర్ నూతన కార్యవర్గం

**అధ్యక్షులు:** నాగసరపు మెహెర్ విజయకృష్ణ, **ఉపాధ్యక్షులు:** శ్రీ చౌడవరపు సముద్రవేణి, **కార్యదర్శి:** కోట కోటేశ్వరరావు, **సహాయ కార్యదర్శి:** చుండూరి ప్రసాదు, **కోశాధికారి:** కాకుమాను మెహెర్ సురేష్, మరియు 12 మంది కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

# రాఘవరపు బాబాలో ఐక్యం

బాబా ప్రేమికురాలు శ్రీమతి రాఘవరపు పద్మావతి గారు ఏప్రిల్ 5న బాబాలో ఐక్యమయ్యారు. వీరి వయస్సు 75 సంవత్సరాలు. మెహెర్ నక్షత్రమాల, మెహెర్ మందారమాల పేరిట చక్కని బాబావారి పాటలు రచించి ఆమె ప్రచురించారు. ఆమె రాసిన ఒక తత్వం నివాళిగా ఈ సంచికలో ప్రచురిస్తున్నాం. దయచేసి పరిశీలించండి. నిత్యం బాబా నామస్మరణలో గడిపిన శ్రీమతి పద్మావతి ధన్యురాలని స్థానిక బాబా ప్రేమికులు ఆమె సేవలను కొనియాడారు. ఆమె స్మృత్యర్థం ఏప్రిల్ 17న బాబా సత్సంగ్ నిర్వహించినట్లు సెంటర్ కార్యదర్శి తెలిపారు.

# తత్త్వం

**పల్లవి:** హృదయతాళము తెరచి, మెహెరుని పదములు
మది భద్రపరచవే మనసా వదలక నీవు ఆ పురుషోత్తముని,
పదిలంగనుంచవే మనసా ॥హృ॥

**చరణం-1:** మాయ సంసారపు వలలోన చిక్కి మ్రగ్గిపోతినే మనసా,
మా జీవితపు సార్ధకతకు, మెహెరుబాబాయే దిక్కు మనసా ॥హృ॥

2. ఎంతో దయగల తండ్రియనుచును, నమ్ముకొంటినే మనసా
అంతరంగమందెల్లపుడునునే, నిలుపుకొందునే మనసా ॥హృ॥

3. ఊపిరి నాకున్నంత వరకు నా, హృదయంబే గుడి మనసా
కాపరుడని ఆ తండ్రిని నమ్మితి, కరుణామయుడని మనసా ॥హృ॥

4. ఎన్నెన్ని జన్మల పుణ్యఫలంబో, ఎరుగనైతినే మనసా,
కన్నయ్యను నా కన్నులలోనా, నిండి ఉండనీ మనసా ॥హృ॥

5. అనుక్షణమును నను క్రమ్మే మాయా, తొలగించుము ఓ మనసా
కనికరమున ఆ మెహెరుని రూపము, తొలగజేయకే మనసా హృ॥

– **ఆర్. పద్మావతి,** నరసరావుపేట

# బాబా మౌనంగా మాట్లాడుతున్నారు

**(ఎ.ఎస్. ఆచారి, విశాఖపట్నం)**



మెహెర్‌బాబా మౌనంగానే మన మధ్యన ఉన్నారు. మౌనంగానే మనందరితో మాట్లాడుతున్నారని బాబా ప్రేమికులు శ్రీ ఎ.ఎస్. ఆచారి, విశాఖపట్నం తన అభిప్రాయంగా తెలియజేశారు. గత అవతారాల కాలంలో చేసిన బోధనలు, సందేశాలు మానవాళి పెడచెవిన పెట్టాయి. అందుకే తాను ఈ అవతార కాలంలో మౌనం పాటించానని మెహెర్‌బాబా ప్రకటించారన్నారు. మెహెర్‌బాబా మౌనం చాలా శక్తివంతమైంది. ప్రగాఢమైందీను. బాబావారి మౌన సంభాషణ ఇంకాకొనసాగుతోంది. ఆయన మాటలు వినాలనుకునేవారు మెహెర్‌బాబా చిత్రపటం ముందు క్షణకాలం నిల్చుంటే తప్పకుండా ఆయన మాటలు మనకు వినపడతాయి.

ఏదైనా కష్టం వస్తే, బాబా చిత్రపటం ఎదుట నిల్చుని, మనస్సులోని మాట ఆయనకు చెప్పుకుంటే, ఊరట కలిగించే తగిన సమాధానం బాబా తప్పక ఇస్తారు.

నేను ఈ సలహాను బాబా ప్రేమికులు అయిన వారికీ, బాబా ప్రేమికులు కాని వారికీ, అందరికీ చెప్తుంటాను. అనేకమంది, అనేకమార్లు నా మాటలతో నూటికి నూరుశాతం అంగీకరించారు. బాబావారి మాటలు తమకు ఎంతగానో ఉపశమనం కల్గించాయని వారు నాతో చెప్పారు. మెహెర్‌బాబా మౌనంగా మనందరితో నిత్యం, అనుక్షణం మాట్లాడుతున్నారు.

# శావల్యాపురంలో బాబా సత్సంగ్

నరసరావుపేట సెంటర్ బాబా ప్రేమికులచే ఏప్రిల్ 13న శావల్యాపురం గ్రామంలో బాబా సత్సంగ్ చలువాది మూర్తమ్మ గారి ఇంట్లో నిర్వహించినట్లు సెంటర్ కార్యదర్శి శ్రీ కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

# ప్రభుస్తుతి

## ప్రభుస్తుతి

ఓ పర్‌వర్దిగార్,
సర్వపోషకా! సర్వ రక్షకా!
నీవు ఆదియును
అంతమును లేని వాడవు,
అద్వయుడవు,
నిరుపమానుడవు,
నీ ప్రమాణమెవ్వరును
ఎరుంగనేరరు
నీవు వర్ణము,
నామము,
రూపము,
గుణములు లేని వాడవు.
నీవు అపరిమితుడవు
గంభీరుడవు,
ఊహాతీతుడవు,
భావనాతీతుడవు,
శాశ్వతుడవు
నాశము లేని వాడవు.
నీవు అవిభాజ్యుడవు,
దివ్యచక్షువులతో గాని
నిన్నెవరును చూడజాలరు
నీవు ఎల్లప్పుడు నుంటివి,
నీవు ఎల్లప్పుడు నున్నావు
నీవు ఎల్లప్పుడు నుందువు
నీవు అంతటను గలవు,
నీవు అన్నింట నున్నావు.
మరి నీవు అంతటికి
అన్నింటికి
ఆవలనుందువు.
నీవు ఆకాశమును గలవు
పాతాళమున గలవు
నీవు వ్యక్తుడవు
అవ్యక్తుడవు,
అన్ని భూమికలందున్నావు,
అన్ని భూమికల కతీతుడవు.
నీవు మూడు
లోకాలలోనున్నావు
ముల్లోకాల కావలగూడ నున్నావు.
నీవు అగోచరుడవు,
స్వతంత్రుడవు.
నీవు సృష్టికర్తవు,
ప్రభువులకు ప్రభుడవు,
అందరి మనస్సులను
హృదయములను
ఎరిగిన వాడవు,
నీవు సర్వశక్తిమంతుడవు,
సర్వవ్యాపివి,
నీవే అనంతజ్ఞానము,
అనంత శక్తియు,
అనంత ఆనందమును.
నీవు జ్ఞానసాగరుడవు,
సర్వజ్ఞుడవు,
అనంత జ్ఞానివి,
త్రికాల వేదివి,
జ్ఞానమే నీవు,
నీవు సర్వదయాళుడవు,
నిత్య శుభంకరుడవు,
నీవు ఆత్మలకెల్ల నాత్మవు
అనంతగుణ విశిష్టుడవు,
నీవు సత్య, జ్ఞాన
ఆనందముల
త్రిమూర్తివి,
నీవే సత్యమునకు
మూలము,
ప్రేమ మహాసాగరుడవు,
నీవు పురాణ పురుషుడవు,
సర్వోత్తముడవు,
నీవు ప్రభుడవు,
పరమేశ్వరుడవు,
నీవు పరుడవు,
పరాత్పరుడవు,
నీవు పరబ్రహ్మవు,
పరమాత్మవు,
అల్లాహ్, ఇలాహీ,
యజ్‌దాన్,
అహురమజ్ దా,
ప్రియతముడైన
భగవంతుడవు,
నీవు 'ఈజద్' అనబడు
ఏకైక పూజ్యుడవు.

# పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్‌దాన్**
**లా ఇలాహ్ ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

# మండలి ప్రార్థన

**ప్రియ దైవమా!**

నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము. మరియు చిట్టచివరి వరకు బాబా కొంగును దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.

## జీవిత సభ్యతం

**2014 మే - జూన్ నెలలో పంపిన వారి వివరాలు**

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 01. | జూన్ | ......., హైదరాబాద్ | రూ. 1000.00 |
| 02. | జూన్ | పి. శ్రీనివాసరావు, దుర్గి, గుంటూరు | రూ. 500.00 |
| | | **మొత్తం** | **రూ.1500.00** |

# పత్రిక సభ్యత్వం

1. మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/- (వెయ్యి రూపాయలు).
2. రెండు దఫాలుగా కూడా రూ.500/- చొప్పున చెల్లించవచ్చు.
3. జీవిత సభ్యత్వం చెల్లింపులపై వచ్చే వడ్డీని మాత్రమే పత్రిక నిర్వహణా ఖర్చులకు వినియోగించాలని నిర్ణయించినప్పటికీ నేటి వరకు జీవిత సభ్యత్వంపై వచ్చిన వడ్డీని కూడా అసలు మొత్తానికే జమచేయడమైనది.
4. వార్షిక సభ్యత్వం రూ.100/- పోస్టల్ మనీ ఆర్డర్ ద్వారా పంపవలిసింది.
5. బ్యాంకు డ్రాఫ్టు లేదా బ్యాంకు చెక్కు ద్వారా పంపగోరు వారు శ్రీమతి శారద హైదరాబాద్ పేరున పంపగలరు.
   ఆన్‌లైన్‌లో పంపగోరువారు...శ్రీమతి శారద,
   ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.
   **SB A/C NO: 173201000027973.**
   **IFSC CODE: IOBA 0001732.**

**మా అడ్రస్: ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్,**
**బాబాస్ హౌస్, యాప్రాల్, ప్లాట్ నెం.32,**
**జె.జె. నగర్ కాలనీ, సికింద్రాబాద్-500087.**
**ఫోన్:99595-53218, email: malladisukku@gmail.com**

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.
**Editor: D.Nirmaladevi**
RNI No. APTEL/2002/7310, Postal Concession: R&D/RNP/HSE/789/2012-2014, **Dt.19-12-2011**